తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## ఇక ప్రజలకు రేషన్ 'స్మార్ట్ కార్డులు'

### - 29న తిరుపతి.. 30న చిత్తూరు జిల్లాల్లో పంపిణీ !!

కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా ఇదివరకు రేషన్‌కార్డులు కలిగి ఉన్న వారికి కొత్తగా రేషన్ స్మార్ట్ కార్డులను అంది ంచనుంది. ఎటిఎం కార్డు తరహాలో ఈ కార్డు ఉంటుంది. ఇందులో కుటుంబ సభ్యుల వివరాలు, ప్రభుత్వ చిహ్నం, క్యూఆర్ కోడ్ తదితరాలు ఉంటాయి. ఎలాంటి రాజకీయ నాయకుల ఫోటోలు ఉండవు. ఈ కార్డులను ఈనెల 29న తిరుపతి, 30న చిత్తూరు జిల్లాలో ప్రజలకు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ చౌక దుకాణాల పరిధిలో ఆయా దుకాణాల డీలర్లకు ఈ కార్డులు చేరతాయి. అనంతరం వీటిని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు పంపిణీ చేయనున్నారు. సెప్టెంబర్ నెల నుంచి ఈ కార్డుల ద్వారానే ప్రజలకు చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నారు.

## 29న సిఎం చంద్రబాబు దంపతులు కుప్పం రాక



కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు,ఆయన సతీమణి ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజి ంగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 29న కుప్పం రానున్నారు. 29వతేది సాయంత్రం శాంతిపురం మండలంలోని శివపురం వద్దగల సొంతింటికి చేరుకుంటారు. ఈనెల 30వతేది కుప్పం మున్సిపల్ పరిధి పరమసముద్రం గ్రామం వద్ద కృష్ణాజలాలకు జలహారతి నిర్వహించి కుప్పం ప్రజలకు అంకిత ం చేయనున్నారు. అనంతరం సిఎం చంద్రబాబునాయుడు పరమసముద్రం వద్ద నిర్వహించే బహిరంగసభలో పాల్గొంటారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

## కార్మికశాఖలో అవినీతి అధికారి



### -భారీగానే బాలునాయక్ అక్రమాస్తులు
### -48గంటల సోదాల తరువాత రిమాండ్‌కు

తిరుపతి,ఆగస్టు 23ప్రభాతవార్త:

కార్మికశాఖలో అసిస్టెంట్ కమిషనర్ హోదాలో కొనసాగి ప్రస్తుతం సంయుక్తకమిషనర్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా ఉన్న బాలునాయక్ భారీగానే అక్రమాస్తులు కూడబెట్టాడని ఏసిబి అధికారులు నిగ్గు తేల్చారు. ఆయన పనిచేసిన చోట్లగాక సొంత అన్నమయ్యజిల్లాలోని సంబేపల్లి, రాయచోటి,మదనపల్లిలోనూ స్థలాలు, ఇళ్ళు, భూములు కుటుంబసభ్యుల పేరున ఉన్నాయని కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. బాలునాయక్ ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించాడనే ఆరోపణల ఫిర్యాదులపై 48గంటలు నిరవధికంగా 11చోట్ల సోదాలు చేసిన ఏసిబి అధికారుల బృందం శనివారం సాయంత్రానికి కీలక విషయాలు గుర్తించారు. ఆయన సర్వీసులో భారీగానే అక్రమాస్తులు సంపాదించాడని నిర్ధారించారు. దీంతో శనివారం సాయంత్రం ఆయన్ను తిరుపతిలో అరెస్ట్‌చేసి నెల్లూరు ఏసిబి కోర్టుకు తరలించారు. విజయవాడ నుండి అందిన సమాచారంతో శుక్రవారం ఉదయం నుండి తిరుపతిలోని కేశవాయనగుంటలో ఆయన ఇంట్లో, మదనపల్లి, రాయచోటి, కర్నూలులోని ఆయన బంధువుల, కుటుంబసభ్యుల ఇళ్ళలో రెండురోజులు ఏకధాటిగా ఏసిబి సోదాలు చేసింది. శనివారం సాయంత్రానికి భారీగానే అక్రమాస్తులు ఉన్నట్లు తేల్చింది. పలు చోట్ల ఇళ్ళస్థలాలు, రెండంతస్థులతో కూడిన ఇల్లు, సంబేపల్లిలో టెంపరీరీ ఇల్లు, భూములు ,పౌల్ట్రీఫామ్‌కలిగివున్నట్లు ఏసిబి తేల్చింది. ఆయన పేరున రెండు నాలుగుచక్రవాహనాలు, ఐదు ద్విచక్రవాహనాలు, 5.50లక్షలు రూపాయలు బ్యాంకు ఖాతాల్లో బ్యాలెన్స్‌లు, 25లక్షలు రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, అరకిలో బంగారు ఆభరణాలు, ఒకకిలో వెండి వస్తువులున్నట్లు గుర్తించారు. కుమారుడి పేరుతో ఫార్మశీ ఉన్నట్లు ఇంకా కీలకపత్రాలను ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎం.బాలునాయక్ 1995లో కార్మికశాఖలో చేరాడు. అప్పటినుండి అంచలంచలుగా ఎదుగుతూ ప్రస్తుతం కర్నూలులోని సంయుక్త కమిషనర్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్నాడు. అతనిని అరెస్ట్‌చేసి నెల్లూరు ఏసిబి కోర్టుకు తరలించినట్లు తిరుపతి ఏసిబి అదనపు ఎస్పీ విమలకుమారి తెలిపారు.

### కడప అటవీ డివిజన్ పరిధిలో

## ముగ్గురు ఎర్రస్మగ్లర్లు అరెస్టు

### 26 ఎర్రచందనం దుంగలు, ఒక కారు స్వాధీనం
### బాడుగకు కార్లు ఇచ్చే వారికి టాస్క్ ఫోర్స్ ఎస్పీ హెచ్చరిక

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 23, ప్రభాతవార్త




కడప డివిజన్ సీకే దిన్నే మండలం పరిధిలోని అటవీ ప్రాంతంలో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 26 ఎర్రచందనం దుంగలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కారును సెల్ఫ్ డ్రైవింగ్ కోసం బాడుగకు తీసుకుని అందులో ఎర్రచందనం అక్రమ రవాణా చేయడం విశేషం. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిఎస్పీ ఎండీ షరీఫ్ మార్గనిర్దేశకత్వంలో కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ ఎం. మురళీధర్ రెడ్డి టీమ్ శుక్రవారం సాయంత్రం నుంచి సీకే దిన్నే మండలం లోని మద్దిమడుగు ఫారెస్ట్ సెక్షన్ లో స్థానిక అటవీ సిబ్బంది షకీల్ అహ్మద్, నారాయణరెడ్డి తో కూంబింగ్ చేపట్టారు. కోలుములపల్లి సమీపంలో కొంతమంది వ్యక్తులు ఒక కారు వద్ద కనిపించారు. వారిని చుట్టుముట్టేందుకు ప్రయత్నించగా వారు పారిపోసాగారు. అయితే టాస్క్ ఫోర్స్ సిబ్బంది వారిని వెంబడించి ముగ్గురిని పట్టుకోగలిగారు. ఆ పరిసర ప్రాంతాల్లో వెతకగా 26 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని అన్నమయ్య జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. వారిని ఎర్రచందనం దుంగలు, కారుతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. డిఎస్పీ వీ. శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ జె. శ్రీనివాస్ వారిని విచారించగా ఆ కారును సెల్ఫ్ డ్రైవింగ్ కోసం బాడుగకు తీసుకుని వచ్చి అందులో ఎర్రచందనం స్మగ్లింగ్ చేయడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ కేసును ఎస్ ఐ రఫీ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రమాదాన్ని తప్పించిన చింత చెట్టు

పాలసముద్రం, ఆగస్టు 23 ప్రభాత వార్త.




పాలసముద్రం మండలం బలిజకండిగ నుండి ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల 30 నిమిషాల వరకు బెంగుళూరు కి కర్ణాటక రాష్ట్ర ఆర్టీసీ, ఎపి రాష్ట్ర ఆర్టీసీ వీటితోపాటు రెండు ప్రైవేటు బస్సులు వివిధ సమయాల్లో వెళుతూ ఉంటాయి. వీటి మధ్యలో చిత్తూరు నుండి బలిజ టకండిగకు ప్రతి గంటకు ఒక బస్సు వెళ తూనే ఉంటాయి. ఇన్ని బస్సులు తిరుగుతూ రద్దీగా ఉన్న ఈ రోడ్డు మాత్రం చాలా ఇరుకైన రోడ్డు ఒక బస్సు వెళితే ఎదు రుగా వచ్చే ద్విచక్ర వాహన వాహనదారులు పక్కకు దిగాలన్న చోటు లేకపోవడంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. శనివారం సుమారు ఉదయం 11గంటలకు బలిజ కండిగ నుంచి బెంగళూరుకు బయలుదేరిన కర్ణాటక రాష్ట్ర ఆర్టీసీ బస్సు పాలసముద్రం సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి సుమారు నాలుగు అడుగుల లోతు ఉన్న ఒక రైతు పొలంలోకి దూకింది. దేవుడులా రోడ్డు పక్కనే ఉన్న చింత చెట్టు బస్సు దోర్లకుండా ఆనుకుంది. ఒక్కసారిగా దూకడంతో అందులో ఉన్న మహిళా కండక్టర్ కు స్వల్ప గాయాలు కావడంతో అక్కడికి వచ్చిన స్థానిక ప్రజలు ఆమెను పక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. బస్సు దొర్లకొండ చింత చెట్టుకు అనుకోవడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు . ఇంత రద్దీగా ఉన్న ఈ రోడ్డును తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి రెండు బస్సులు వెళ్లే విధంగా రోడ్డును వెడల్పు చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## ఒంటరి మహిళ భూమిపై రాజకీయ నేత కన్ను!

తొట్టంబేడు,ఆగస్టు 23 ప్రభాత వార్త.

తొట్టంబేడు మండలం చోడవరం గ్రామానికి చెందిన ఓ ఒంటరి దళిత మహిళ భూమిపై వైసిపి నేత కన్ను పడిందని రెవెన్యూశాఖకు ఆ మహిళ ఫిర్యాదు చేసింది. తన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్లాట్లుగా చేయటానికి ప్రయత్నిస్తున్నారని రెవెన్యూశాఖకు ఫిర్యాదు చేసింది. పేదవారి బాధ అధికారులకు పడుతుందా? చేమూరు దళిత వాడకు చెందిన మాదమాల వెంకటలక్ష్మికి 2013లో ఏడో విడత భూ పంపిణిలో చేమూరు రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నెంబర్ 308ఢిలో 1.68 ఎకరాల భూమిని అందించారు. అయితే చోడవరానికి చెందిన ఓ వైసిపి నేత ఆ భూమిని ఆక్రమించుకునేందుకు గత కొన్నాళ్లుఘాప్రయత్నిస్తున్నారని వాపోయారు. గత ప్రభుత్వ హాయంలో అధికార పార్టీ అధినాయకుని అధికారాన్ని అడ్డుపెట్టుకొని వెంకట లక్ష్మిపై దౌర్జన్యాలకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ప్రభుత్వం పని చేసిన అధికారులు పట్టించుకోక పోగా ప్రస్తుత కూటమి పాలనలో ౾కూడా అధికారులు న్యాయం చేయటం లేదని వాపోతున్నారు.ఈ సమస్య కమ్యూనిస్టుల చేతికి అందింది. న్యాయం చేయకుంటే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

## హనుమంతవాహనంపై కోదండరాముడు



తిరుపతి,ఆగస్టు23 ప్రభాతవార్త:

అమావాస్య సందర్భంగా శనివారం ఉదయం తిరుపతిలోని కోదండరామాలయంలో సహస్రకళశాభిషేకం జరగ్గా, సాయంత్రం హనుమంత వాహనంపై ఊరే గారు. రామభక్తుడైన హనుమంత వాహనసేవను భక్తులు తిలకించి గోవింద... రామా... జైశ్రీరామ్ నామస్మరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేశ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### పలమనేరు నియోజకవర్గంలోకి

## హంద్రీ-నీవా జలాలు

పలమనేరు, ఆగస్టు 23, ప్రభాతవార్త:




హంద్రీ-నీవా జలాలు శుక్రవారం రాత్రి పలమనేరు నియోజకవర్గంలో ప్రవేశించాయి. గంగవరం మండలం పసుపత్తూరు, గుండుగల్లు, బొమ్మనపల్లె మీదుగా ఈ నీరు పరవళ్ళు తొక్కుతూ వి.కోట మండలంలో చేరుతున్నాయి. గత 10 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు నదులు పరవళ్ళు తొక్కుతూ పొంగుతుండడంతో హంద్రీ-నీవా కాలువ వెంబడి నీరు ప్రవహిస్తున్నాయి. వి.కోట నుండి కుప్పం మండలంలో ఈ నీరు ప్రవేశిస్తాయి. దీంతో ఈ ప్రాంత వాసుల చిరకాల కల నెరవేరినట్లైంది. ఈ నెల 31న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పంలో హంద్రీ నీవా జలాలకు జలహారతితో ఈ ప్రాంత వాసులకు అంకింతం చేస్తారు. 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించారు.

## తల్లిబిడ్డను ఆత్మహత్యాయత్నం నుండి రక్షించిన ఎస్ఐ

యాదమరి, ఆగస్టు 23 ప్రభాతవార్త:

కుటుంబ కలహాలతో భర్తపై అలిగి 3 సంవత్సరాల పిల్లాడిని ఎత్తుకుని ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్ళిన భార్యలో మనోధైర్యం నింపి ఆత్మహత్య చేసుకోకుండా ఆమెను యాదమరి ఎస్ఐ ఈశ్వరయ్య రక్షించి అందరి మన్ననలు పొందారు. యాదమరి మండలం రసూల్‌నగర్‌కు చెందిన నహీన తన 3 సంవత్సరాల పిల్లాడితో భర్తపై అలిగి ఇంటి నుండి వెళ్ళిపోయింది. అంతే భార్య తన 3 సంవత్సరాల కుమారుడిని ఎత్తుకుని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించి యాదమరికి వచ్చి బస్సు ఎక్కింది. ఆమె బిడ్డతో పాటు నేరుగా తిరుపతి రైల్వేస్టేషన్ పరిసరాలకు వెళ్ళి తాను, తన బిడ్డ ఇద్దరు కలిసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోనున్నట్లు భర్తకు మెసేజ్ పంపింది. దీంతో కంగారుపడ్డ భర్త సాయంత్రం 5 గంటలకు ఎస్ఐ ఈశ్వరయ్యకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఈశ్వరయ్య అతని భార్య ఫోన్ ఆన్‌లోనే వుండటంతో ఆమెకు ఫోన్ చేసి సముదాయించారు. అదే సమయంలో తిరుపతి రైల్వేపోలీసులకు ఎస్ఐ ఈశ్వరయ్య సమాచారం అందించడంతో రైల్వే పోలీసులు రంగంలోకి దిగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడుతున్న భార్య లైవ్ లోకేషన్ గుర్తించి అక్కడికి చేరుకుని భార్య, 3 సంవత్సరాల పిల్లవాడిని రక్షించి యాదమరి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు.

## నిత్యాన్నదాన పథకానికి మూడు లక్షలు విరాళం





కాణిపాకం, ఆగస్టు 2 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం ఇద్దరు భక్తులు రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు ఈమేరకు యాదమరి మండల కుక్కలపల్లెకు చెందిన పోలా సుబ్రమణ్యం 1,01,116 రూపాయలు,తెలంగాణా రాష్ట్రం సంగారెడ్డికి చెందిన శివశంకరి అనే భక్తుడు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

### స్వచ్ఛాంధ్ర స్వర్ణ ఆంధ్రలో

## ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 23, ప్రభాతవార్త

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్రలో ప్రజలందరూ భాగస్వాములు కావాలనీ, స్వచ్ఛాంధ్ర స్ఫూర్తితో స్వచ్ఛ తిరుపతి సాధనకు ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బాబు జగజ్జీవన్ రామ్ పార్కు నందు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాబు జగజ్జీవన్ రామ్ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి. మునికృష్ణ, రాష్ట్ర హస్తకళల శాఖ చైర్మన్ డాక్టర్ హరి ప్రసాద్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ పూకా విజయకుమార్, కార్పొరేటర్లు నరసింహ ఆచారి అధికారులు పాల్గొని మొక్కలు నాటి, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం రామానాయుడు స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వడంపై ప్రజలకు, చేతులు కడుక్కోవడం వలన కలిగే ప్రయోజనాలు, జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కోవడం అలవాటుగా మార్చుకోవాలని ఆయన కోరారు. వర్షపు నీరు నిల్వతో దోమలు పెరిగి చికున్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు వ్యాప్తి చెందుతాయని ఆయన చెప్పారు. తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ఒక వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాకుండా, సమాజం పట్ల మనం చూపించే బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛంద కార్యక్రమాలు విజయవంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరం అని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో కమిషనర్ స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, ప్రజా ప్రతినిధులు విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు అక్టోబర్ 31 వరకు కంటి పరీక్షలు

### - ఇప్పటికే 20 వేల మంది విద్యార్థుల కంటి పరీక్షలు పూర్తి
### - జిల్లా ఆంధత్వ నివారణ సంస్త ప్రొగ్రాం మేనేజర్ డాక్టర్ డిఎస్ అర్పిత





చిత్తూరుహెల్త్, ఆగస్టు 23 ప్రభాతవార్త:

జిల్లాలో పాఠశాల స్థాయి విద్యార్థులకు కంటి చూపు తగ్గకుండా వుండటానికి జిల్లా అంథత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పక్కా ప్రణాళికతో కంటి పరీక్షలు నిర్వహించి కంటి చూపు మందగించిన విద్యార్థులను గుర్తించి వారికి ఉచితంగా కళ్ళజోడు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా ఆంథత్వ నివారణ సంస్థ ప్రొగ్రాం మేనేజర్ డాక్టర్ డిఎస్ అర్పిత పేర్కొన్నారు. జిల్లా ఆంథత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు జరుగుతున్న ఉచిత కంటి పరీక్షలపై ప్రొగ్రాం మేనేజర్ డాక్టర్ డిఎస్ అర్పిత 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ జిల్లా ఆంథత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జులై 21వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలకు సంబంధిచి స్క్రీనింగ్ టెస్ట్‌లను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అక్టోబర్ 31వ తేదీ వరకు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్దం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 1,243 ప్రభుత్వ పాఠశాలలు వుండగా ఇందులో 33 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. జిల్లా ఆంథత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 131 ప్రభుత్వ పాఠశాలల్లోని 19,965 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇందులో 1,354 మంది విద్యార్థులకు కళ్ళజోడు అవసరం అని స్క్రీనింగ్ టెస్ట్‌ల ద్వారా నిర్ధారించడం జరిగిందన్నారు. కళ్ళజోడు అవసరమైన విద్యార్థులకు జిల్లా అంథత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కళ్ళజోళ్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 19,965 మంది విద్యార్థుల కళ్ళకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఇందులో 1,354 మంది విద్యార్థులకు కళ్ళజోడు అవసరం అని గుర్తించడం జరిగిందని జిల్లా ఆంథత్వ నివారణ సంస్థ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ డిఎస్ అర్పిత తెలిపారు.

## నేడు ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ గ్రామ సర్వేయర్లుకు పరీక్ష

### – తిరుపతి జిల్లాలో మూడు పరీక్షాకేంద్రాలు
### – హాజరు కానున్న 1450 మంది అభ్యర్థులు- డీఆర్వో నరసింహులు



తిరుపతి కలెక్టరేట్ , ఆగస్టు 23 ప్రభాతవార్త ః

జిల్లాలో జరగనున్న ఏపీపీఎస్సీ కంప్యూటర్ డిపార్ట్‌మెంటల్ పరీక్ష ఆగస్టు 2025 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని జి. నరసింహులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ చాంబర్ నందు సంబంధిత అధికారులతో ఆదివారం జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సాయంత్రం 6 గంటలకు సెకండ్ సెషన్స్ వరకు మూడు కేంద్రాల నందు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయని పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఏపీపీఎస్సీ నుంచి టీఎస్ రాజగోపాల్, అసిస్టెంట్ సెక్రటరీ ఎం. జగదీష్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఎ.యోగేష్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కేవీబీ పురంలో వరుస చోరీలు

### న కాట్రపల్లి కల్యాణ శ్రీనివాసుడి ఆలయంలో రూ.10 లక్షలు అపహరణ
### న తిమ్మసముద్రం, ఆరెలో చోరీ న వణికిస్తున్న పల్లెలు

కేవీబీ పురం, ఆగస్టు 23 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలోని పల్లె గ్రామాలను గత కొద్ది రోజులుగా దొంగలు వణికిస్తున్నారు. గత నెలలో మండలంలోని తిమ్మ సముద్రం, ఆరె, వేమలపూడి ఘటనలు మరువక ముందే మళ్లీ కాట్రపల్లిలో దొంగలు పడ్డారు. ఆ గ్రామంలో ఉన్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి వేళలో దొంగలు పడి ఆలయంలోని హుండీతో పాటు సుమారు 10 లక్షలు విలువ చేసే అమ్మవారి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. ఆలయంలో చోరీ చేసిన హుండీ, వస్తువులు, అమ్మవారి సూలంను దొంగ మోసుకెళుతున్న వీడియో పక్కనే ఉన్న ఇంటి సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. గ్రామ సమీప పంట భూముల్లో పగులగొట్టి పడేసిన ఆలయ హుండీ దర్శనమిచ్చింది. ఈ ఘటనపై ఆలయ కమిటీ పెద్దలు రాష్ట్ర బీజేపీ నేత కోలా ఆనంద్, వైసీపీ నేత గవర్ల కృష్ణయ్యలు స్థానికులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు చోరీ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



### కలవర పెడుతున్న వరుస చోరీలు

గత నెలలో మండలంలోని తిమ్మ సముద్రం గ్రామంలో నిద్రిస్తున్న ఇద్దరు మహిళల మెడలో బంగారు గొలుసులను దొంగలు కత్తిరించుకెళ్లారు. ఆ ఘటనకు రెండు రోజుల అనంతరం ఆరె గ్రామంలో నగదు, బంగారు, వెండి వంటి సుమారు రూ. కోటి విలువైన సొత్తును గుర్తు తెలియని దుండగులు అపహరించుకెళ్లారు. ఆ ఘటన జరిగిన వారానికే వేమలపూడి గ్రామంలోని రెండు ఆలయాల్లో దొంగలు పడి, అందిన కాడికి దోచుకెళారు. దాని తరువాత మరో ఘటన జరిగినప్పటికే పోలీసులకు ఫిర్యాదు అందలేదు. ఆ ఘటనలు మరువక ముందే కాట్రపల్లిలో మరోమారు దొంగలు పడి రూ.10 లక్షల సొత్తు దోచుకెళ్లారు. దీంతో పల్లె గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు.

### న ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నాం : పోలీసులు

వరుస చోరీలపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నాం. ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని, అనుమానాస్పదంగా ఎవరైనా కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇల్లు వదిలి ఊర్లు వెళ్లేవారు ముందస్తు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రిళ్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మారుమూల గ్రామాల్లో నిఘా పెంచామని, త్వరలో నిందితులను పట్టుకుని కటకటాల్లోకి నెట్టేస్తామని అన్నారు. కానీ ప్రజలు దొంగతనాలను అరికట్టే విధంగా వారి జాగ్రత్తలు వారు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పోలీసులు కోరారు.

## పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత



పులిచెర్ల, ఆగస్టు 23, ప్రభాతవార్త

పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని టిడిపి నాయకులు గుమ్మడి రామకృష్ణ నాయుడు, పంచాయతీ కార్య దర్శి సురేష్ అన్నారు. పులిచెర్ల మండలం పాలెం పంచా యతీ గుట్ట మీద దళితవాడలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి వర్షాకాలంలో పారిశుధ్యం పరిశుభ్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పారిశుధ్య చర్యలు పాటించి, అంటూ వ్యాధులను నివారిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రేణుకా దేవి మృతి బాధాకరం



వైసిపి రాష్ట్ర నాయకులు వల్లివేడు రాజారెడ్డి

కల్లూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త

ఆత్మీయురాలైన రేణుకా దేవి ఆకస్మిక మృతి బాధాకరమని మనసును ఎంతో కలచి వేసిందని వైసిపి రాష్ట్ర నాయ కులు వల్లివేడు రాజారెడ్డి అలియాస్ పృధ్విరెడ్డి అన్నారు. చెన్నైలో వల్లివేడు రాజారెడ్డి ప్రాణ స్నేహితులు తమిళ నాడు రాష్ట్ర మంత్రి టీఆర్‌బి రాజా తల్లి మాజీ కేంద్ర మం త్రి టి ఆర్ బాలు సతీమణి రేణుకా దేవి అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న వల్లి వేడు రాజారెడ్డి చెన్నైకి చేరుకుని టీ నగర్‌లో రేణుకా దేవి కి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులైన పా రిశ్రామిక వేత్త టీఆర్‌బి రాజు, షర్మిల దంపతులు సెల్వ కుమార్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## జీవితానికి ఒక లక్ష్యం



- అనుకున్నది సాధించాలని ఆశయం

కల్లూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త

కష్టపడితే జీవితం బాగుంటుందని నమ్మకం. తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కలిగించవచ్చునని. విశ్వాసం. ఇవి అన్ని నెరవేరాలంటే. చదువు ఒకటే మార్గం. అనుకున్నాడు ఆ పల్లెటూరు రైతు బిడ్డ.. అదే ధ్యేయంతో పల్లెటూరు నుంచి విద్యాభ్యాసం సాగించి సాధారణ పాఠశాలలో చదివి భావితరానికి మార్గదర్శకంగా నిలిచే ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యాడు. ఆ పల్లెటూరు అబ్బాయి సింబల భాస్కర. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం బోడి రెడ్డి గారి పల్లి పంచాయతీ ఆవుల పెద్దిరెడ్డి గారి పల్లికి చెందిన నాగరాజు పార్వతమ్మ.. దంపతుల కుమారుడు భాస్కర ప్రాథమిక విద్యాభ్యాసం స్థానిక పాఠశాల.. కల్లూరు జడ్పీ హైస్కూలు.. ఇంటర్ మీడియట్ పీలేరు ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ, బీఈడీ తిరుపతిలో చదివారు. ఇలా సాధారణ పాఠశాలలో కళాశాలలో చదివి మంచి మార్కులు సాధించాడు ఇటీవల జరిగిన మెగా డీఎస్సీ పరీక్ష రాశాడు. ఈ ఫలితాల్లో అందర్నీ ఆశ్చర్యపరిచేలా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. పిజిటిలో 75 మార్కులతో జోన్ ఫోర్‌లో ఒకటవ ర్యాంకు టీజీటీలో 77 మార్కులతో జోన్ ఫోర్‌లో తొమ్మిదవ ర్యాంకు.. స్కూల్ అసిస్టెంట్ పోస్టులో ఆరవ ర్యాంకు సాధించి తల్లిదండ్రులు స్నేహితులు సంబరాలు చేసుకున్న విధంగా శభాష్ అనిపించుకున్నాడు. కాబోయే నూతన ఉపాధ్యాయుడు సింబల భాస్కర్.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



పూతలపట్టు, ఆగస్టు 23, ప్రభాతవార్త

పూతలపట్టు మండలం బందర్లపల్లి సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం అయింది. స్థానికులు వివరాలు మేరకు ట్రైన్ నుంచి అదుపుతప్పి వ్యక్తి కింద పడి మృతి చెందినట్లు ఆనవాళ్లు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. దీనిపై పూతలపట్టు సీఐ కృష్ణమోహన్, రైల్వే పోలీసులు సంఘ స్థలానికి చేరుకునే విచారిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తి మృతిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పాలిటెక్నిక్ కాలేజ్‌లో ఉచిత దంతవైద్య శిబిరం



కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త

కుప్పంలోని డా॥ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో కుప్పంలోని అరుణ్ డెంటల్ కేర్ ఆస్పత్రి ఛైర్మన్ డా॥ అరుణ్‌కుమార్‌చే ఉచిత దంతవైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 300మంది విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు ఉచితంగా అందించారు.దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగన్నాథరావు, డా॥ శివసాయి, అధ్యాపకులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తపేట రోడ్డు విస్తరణకు సహకరించాలి

కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త



కుప్పం పట్టణ అభివృద్ధిలో భాగంగా కొత్తపేట ప్రాంతంలో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు స్థానిక ప్రజలు, వ్యాపారులు సహకరించాలని టిడిపి మున్సి పల్ అధ్యక్షుడు, కడ సభ్యుడు రాజ్‌కుమార్ కోరారు. శనివారం స్థానిక శ్రీ పెద్దపల్లి గంగమ్మ ఆలయం ఆవరణలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కో ఇన్‌చార్జ్ తిరుమగళ్, యూనిట్ ఇన్‌చార్జ్ ముఖేష్ తదితరులతో కలసి సమావేశం నిర్వహించారు. కొత్తపేట ప్రాంతంలో యాభైఅడుగుల విస్తీర్ణంతో రోడ్డు విస్తరణ చేయనున్నట్లు తెలిపారు. ఇక్కడే ఆర్డీఓ, డిఎస్పీ, ఎక్సైజ్ కార్యాలయాలు నిర్మి ంచనున్నట్లు తెలిపారు. దుకాణాలు, ఇళ్లు నష్టపోయేవారికి మంచి పరిహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. సమావేశంలో నేతలు మునెప్ప, మణి, కృష్ణన్, లోకేష్, సుకుమార్, ఇర్ఫాన్, హరినాథ్, అమర్ చంద్ర, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రకు ప్రజలు సహకరించాలి

శాంతిపురం, ఆగస్టు 23 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు పిలుపునిచ్చిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంకు ప్రజలు సహకరించాలని టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు కోరారు. శనివారం శాంతిపురంలో సాసా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మురుగునీటి కాల్వల శుభ్రం, తడిపొడి చెత్త సేకరణ, దోమల నియంత్రణ, అవగాహన కార్యక్రమాలగురించి వివరించారు. స్థానికంగా చెత్తసేకరణకు బాక్సులు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నేతలు ఉదయ్‌కుమార్, ఎల్.జయరాంరెడ్డి, సర్పంచ్ ఎవి జయరాం, రమేష్, రాజారెడ్డి, రాజు, శివ, కోదండప్ప, రాధాకృష్ణ, కార్యదర్శి స్వాతి పాల్గొన్నారు.

## వి.కోట మండలానికి చేరుకున్న కృష్ణాజలాలు

వి.కోట, ఆగస్టు 23 ప్రభాతవార్త



హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణాజలాలు శనివారం వి.కోట మండలంలోకి ప్రవేశించాయి. దీంతో గ్రామాల్లో స్థానిక ప్రజలు, రైతులు కృష్ణాజలాలకు హారతులు పట్టారు. మొట్లపల్లి వద్ద ఏర్పాటుచేసిన పంప్‌హౌస్ వద్ద నేతలు, అధికారులు నదీ జలాలకు హారతులు పట్టారు. అనంతరం భారీ మోటార్లను ఆన్‌చేసి కుప్పం వైపు నీటిని మళ్లించారు. ఇఇ వెంకటేశ్వరరావు, సిఇ వరప్రసాద్ మాట్లాడుతూ జూలై 17న సిఎం చంద్రబాబునాయుడు నందికొట్కూరు వద్ద హంద్రీ-నీవా జలాలు విడుదల చేశారన్నారు. సుమారు 110చెరువులు నింపడంతో 6300ఎకరాల భూమి సాగులో వస్తుందన్నారు. కార్యక్రమంలో రిత్విక్ సంస్థ పిడి నాగేశ్వరరావు, నేతలు రామచంద్రనాయుడు, రంగనాథ్, రాంబాబు, నారాయణ స్వామి, సోము, ప్రజలు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

వి.కోట, ఆగస్టు 23 ప్రభాతవార్త

స్థానికంగా ఉన్న ఎరువుల దుకాణాల్లో యూరియా విక్రయాలపై తిరుపతి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాలతో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరవి తనిఖీలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న వినాయక, మురళీకృష్ణ ట్రేడర్స్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. కాగా యూరియా సక్రమంగా లభించడం లేదని రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే యూరియా స్టాకు వస్తుందని అధికారులు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ అప్పోజి పాల్గొన్నారు.

## డిఎస్సీ ఫలితాల్లో లావణ్యకు స్టేట్ ర్యాంక్



పెద్దపంజాణి, ఆగస్టు 23 ప్రభాతవార్త

డిఎస్సీ ఫలితాల్లో మండలంలోని శంకరరాయలపేటకు చెందిన శంకరప్ప కుమార్తె లావణ్య రాష్ట్రస్థాయిలో ర్యా ంకులు సాధించింది. బిసి -ఎ విభాగంలో ఈమె స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 5వ ర్యాంకు, టిజిటి విభాగంలో రాష్ట్రంలో 6వ ర్యాంకు సాధించింది.

## కోళ్ల టెంపో ఢీకొని ఆవు..దూడ మృతి

పెద్దపంజాణి, ఆగస్టు 23 ప్రభాతవార్త



మండలంలోని బసవరాజు క ండ్రిగ వద్ద కోళ్ల టెంపో ఢీకొని ఓ ఆవు, దూడ మృతి చెందాయి. గ్రామానికి చెందిన శేఖర్ అనే రైతు యొక్క ఆవు,దూడ రోడ్డు పక్కన గడ్డి మేస్తుండగా తమిళనాడునుంచి కోళ్లను తరలించే టెంపోఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో ఒకటిన్నర లక్ష దాకా నష్టం కలిగినట్లు బాధితుడు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## మెగా డీఎస్సీలో శ్రీప్రజ్ఞ జయభేరి

తిరుపతి విద్య, ఆగస్టు 23 ప్రభాతవార్త.

మెగా డీఎస్సీ 2025 నందు ప్రభుత్వ ప్రకటించిన మెరిట్ లిస్ట్ నందు తిరుపతి శ్రీ ప్రజ్ఞ స్టడీ సర్కిల్ విద్యార్థులు స్టేట్ ర్యాంకు లతో పాటు జిల్లా ర్యాంకుల సాధించి విజయభేరి మోగించారని సంస్థ డైరెక్టర్ సి మల్లేశ్వరి తెలిపారు.ఎస్ ఏ సోషల్ విభాగంలో స్టేట్ 9వ ర్యాంకుతో పాటు జిల్లా మొదటి ర్యాంకును ఎం సురేష్ కుమార్, కవిత చిత్తూరు జిల్లా మూడవ ర్యాంకు,ఓసి విభాగంలో జిల్లా ఫస్ట్ ర్యాంకు ధర్మ జిల్లా స్థాయి ఎస్ ఏ మాథ్స్ ఏడవ ర్యాంకు, యోగేంద్ర జిల్లా స్థాయిలో ఎనిమిదో ర్యాంకు,రవీంద్ర ఎస్ ఏ ఫిజిక్స్‌ జిల్లా 9వ ర్యాంకు,నేత్ర ఎస్జిటిలో పదవ ర్యాంకు బీసీ విభాగంలో ఫస్ట్ ర్యాంక్ తో పాటు సాధించినట్లు పిజిటి ప్రిన్సిపాల్ స్టేట్ ర్యాంకులు సాధించినటువంటి అందరిని అభినందించారు.వీరిని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సత్యనారాయణ అభినందించారని తెలిపారు.ఈ సమావేశంలో ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సూచికలున్నా లేని స్పీడ్ బ్రేకర్లు



-గాల్లో కలుస్తున్న ప్రాణాలు

చౌడేపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త

సూచికలున్నా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చౌడేపల్లి-బోయకొండ ప్రధాన రహదారి ప్రభుత్వ జూనియర్ కళాశాల, బిసి కాలనీల వద్ద అధికంగా ట్రాఫిక్ వుంటుంది. బోయకొండ ఆర్చి నుంచి జూనియర్ కళాశాల మీదుగా ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు లేవు. దీంతో ప్రతి రోజూ ప్రమాదాలు సంభవిస్తున్నారు. ఇటు కాలనీ ప్రజలు, అటు విద్యార్థులు నిత్యం తిరుగుతూ వుంటారు. ఇటీవల పెద్దూరుకు చెందిన చక్రపాణి, గతంలో మరో ఇద్దరు ఇదే స్థలంలో మృతి చెందగా, వందలాది మంది క్షతగాత్రులయ్యారు. రోడ్డు వేసే క్రమంలో ప్రమాద సూచికలు పెట్టినప్పటికీ ఆదిశగా ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని జూనియర్ కళాశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి : సీఐ

వెదురుకుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త :



శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌ఫెక్టర్ హనుమంతప్ప పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు నగరి డిఎస్పీ మహమ్మద్ అజీజ్ సూచనల మేరకు కార్వేటినగరం సర్కిల్ ఇన్‌ఫెక్టర్ హనుమంతప్ప ఆధ్వర్యంలో శనివారం మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీ పరిధిలోగల షీకారీ కాలనీలో కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలపరిరక్షణ పై అవగాహన అవసరమన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని 12 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే షీకారీ వాసులవాహనాల రికార్డులు తనిఖీ చేశారు. అలాగే షీకారీలకు చట్టలు, రికార్డులు లేని వాహనాలు ఉపయోగించకుడదని అవగాహన కల్పించి అనేక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది, షీకారీ వాసులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపట్ల అవగాహన అవసరం : ప్రిన్సిపాల్

వెదురుకుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త :



పరిశుభ్రతపట్ల విద్యార్థులకు అవగాహన అవసరమని వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద పేర్కొన్నారు. కళాశాలలో స్వరాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెలను బుతుకాల స్వచ్ఛత మరియు ఆరోగ్య భద్రత దిశగా నడపడం అయినదని ఇందులో భాగంగా చేతులు శుభ్రత, పొడి బట్టలు వినియోగం, పరిసరాల పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు తీసుకోవల్సన జాగ్రత్తలనుు వివరించారు. విద్యార్థులకు చేతులు శుభ్రం చేయడం విధానాలను నేర్పించడం జరిగింది. విద్యార్థులచేత చేతులు కాడగడం నేర్పించారు. తరువాత పరిసరాల పరిశుభ్రత పై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేష్చ వైఎస్ ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్నలత, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శుభ్రతతోనే వ్యాధులకు కట్టడి



చిత్తూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త:

వర్షాకాలంలో పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్ర తతోనే వ్యాధులను కట్టడి చేయవచ్చునని మేయర్ అముద పేర్కొన్నారు. 'స్వర్ణ ఆంధ్రా-స్వచ్ఛ ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా శనివారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'మాన్ సూన్ హైజిన్' అంశంపై ప్రత్యేక అవగాహన, ర్యాలీ, దోమల నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించారు. లిటిల్‌ఫ్లవర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మేయర్ అముద మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో నగర పరిధిలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ప్రజలు సైతం నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా వుంచేలా చూడాలన్నారు. అలాగే వర్షాకా లంలో వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చామంతిపురంలో అవగాహన ర్యాలీ, దోమల నియంత్రణ చర్యలు నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, ఇన్‌ఛార్జ్ కమీషనర్ వెంకటరామిరెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ ఎ.ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, కార్పొరేటర్ ఇందు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రకాశం పంతులు జయంతి వేడుకలు



చిత్తూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త: ఆంధ్రకేసరి టంగు టూరి ప్రకాశం పంతులు జయంతి ఉత్సవాలును జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ మణికంఠ చందోలు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కనుమర్తి గ్రామంలో టంగుటూరి ప్రకాశం 1872 ఆగస్టు 23వ తేదీ జన్మించారని, ఆయన దేశ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో ఆపార ధైర్యసాహసాలతో పేరు గడించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జ్ అడ్మిన్ ఎఎస్పీ ఎస్.ఆర్.రాజశేఖ ర్‌రాజు, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌బాషా, ఆర్ఐ ఎంటిఓ చంద్రశేఖర్, పోలీసు కార్యాలయ ఎఓ నాగభూషణమ్మ, డిసిఆర్‌బి ఎస్ఐ పద్మ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చదువు, అనుభవం, సంపాదనకు అపోలో వేదిక

- అపోలో యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్

చిత్తూరుహెల్త్, ఆగస్టు 23 ప్రభాతవార్త:

అపోలో యూనివర్సిటీ చదువు, అనుభవం, సంపాదనలకు వేదికగా మారిందని, ప్రతి విద్యార్థి నిష్ఠతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్ పేర్కొన్నారు. అపోలో యూనివర్సిటీలో శనివారం 'చదవుకుంటూనే సంపాదించు' ప్రత్యేక పథకం కింద ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. ముఖ్య అతిధిగా హాజరైన వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్.వినోద్‌భట్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పని అనుభవం పొందడం నేటి తరంకు అత్యవసరం అన్నారు. యూనివర్సిటీలోని ఐటి, మార్కెటింగ్, లైబ్రరీ, అడ్మినిస్ట్రేషన్, కెరీర్ కౌన్సెలింగ్, ఫిజియోథెరపి, ప్రెస్ అండ్ పబ్లికేషన్స్ విభాగాల్లో విద్యార్థులకు చదువుతో పాటు ఆచరణాత్మక పని అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ జగదీషన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ ఎస్ఎస్ షానీ, విభాగాధిపతులు, అభ్యాసకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## వివేకానంద సాగర్‌లో వినాయక ప్రతిమలు నిమజ్జనం

- చిత్తూరు నగర గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు

చిత్తూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త: వినాయక చవితి పురస్కరించుకుని చిత్తూరు నగర పరిధిలో ఏర్పాటు చేసే వినాయక ప్రతిమలన వినాయక చవితి అనంతరం కట్టమంచి వివేకానంద సాగర్‌లో మాత్రమే నిమజ్జనం చేయాలని చిత్తూరు నగర గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు పేర్కొన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు రామభద్ర, హరిప్రసాద్, షణ్ముగం, వెంకటేష్, జయచంద్ర, జ్యోతిబాబులు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ జరుగనున్న వినాయక చవితి పురస్కరించుకుని నగర పరిధిలో ఏర్పాటు చేసే వినాయక మండపాల వద్ద పోలీసుశాఖ నియమ నిబంధనలు ఉల్లంఘించకుండా భక్తి పాటలను మాత్రమే పెట్టాలని, ఎవరికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నడుచుకోవాలని కోరారు.

## వైద్యసేవలకు ప్రభుత్వం ప్రాధాన్యం

- పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్

యాదమరి, ఆగస్టు 23 ప్రభాతవార్త:



నిరుపేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని యాదమరి పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గువ్వలకాలనీలో శనివారం డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపుకు తహసిల్దారు పార్థసారధి, ఎంపిడిఓ వేణు, యాదమరి పిహెచ్‌సి సిహెచ్‌ఓ శ్రీనివాసమూర్తిలు హాజరయ్యారు. మెడికల్ క్యాంపుకు హాజరైన వారికి డాక్టర్ అనిల్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదమరి పిహెచ్‌సి సూపర్‌వైజర్ లక్ష్మీపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అరగొండలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీ



తవణంపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త: మండలంలోని అరగొండ గ్రామపంచాయతీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంను పెద్దఎత్తున నిర్వ హించారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది , పారిశుద్య కార్మికులు, పాఠశాల విద్యార్థులు సచివా లయ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు,జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ హరిప్రసాద్‌రెడ్డిల ఆధ్వర్యంలో గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కొత్త బస్టాండులో మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, స్థానిక సర్పంచ్, మల్లుదొరై ప్రశాంత్‌కుమార్, గ్రామ కార్యదర్శి మురుగేశన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య

పలమనేరు, ఆగస్టు 23, ప్రభాతవార్త:



బైరెడ్డిపల్లె మండలం బురిశెట్టిపల్లె వద్ద బావిలో పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం మృతదేహం బావిలో తేలియాడుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు శవాన్ని వెలికి తీసి శవపరీక్షకు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వయస్సు 30 ఏళ్ళు ఉండవచ్చు. మీసాలు, గడ్డం పెంచి గళ్ళ చొక్కా ధరించివున్నాడు. చుట్టుపక్కల ప్రాంతానికి చెందిన వాడా లేక దూరప్రాంతాలకు చెంది వాడా అంతుబట్టటం లేదు. బహుశా కుటుంబ సమస్యలు, లేదా వివాహేతర సంబంధాలతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడా అని అనుమానాలు వెలువడుతున్నాయి. శరీరంపై ఎలాంటి గాయాలు లేక పోవడంతో యువకుడు హత్యకు గురైనట్లు ఎలాంటి ఆధారాలు లేవు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తు పడితే సెల్ నెంబర్ 6304548225కు ఫోన్ చేయాలని పోలీసులు కోరుతున్నారు.

## పలమనేరులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ర్యాలీ

పలమనేరు టౌన్, ఆగస్టు 23, ప్రభాతవార్త:



పలమనేరులో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కమీషనర్ రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు ఈ రానయలీలు జరుగుతున్నాయని పారిశుద్యం పట్ల ప్రజలను అప్రమత్తం చేయడంమే ఈ ర్యాలీల ఉద్దేశ్యమన్నారు. వర్షాలు పడుతుండడంతో తరచూ అనారోగ్యయ సమస్యలు తలెత్తుతున్నాయని వాటని నివారించడానికి తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. తమ ఇళ్ళతో పాటు పరసరాలు కూడా శుభ్రంగా వుంచుకోవాలని అప్పడే రోగాలు దరిచేరకుండా ఉండవచ్చని సూచిం చారు. మాజీ సైనికోద్యోగి సిద్దయ్యనాయుడు మాట్లాడుతూ క్లీన్ అండ్ గ్రీన్ పలమనేరుకు కొత్తకాదని గతంలో రెండు సార్లు క్లీన్ అండ్ గ్రీన్‌లో రాష్ట్ర స్థాయి అవార్డులు గెలుచుకున్నామని తెలిపారు. మరో సారి అవార్డు గెలుచుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ ర్యాలీలో డ్వాక్రా మహిళలు, సచివాలయాల సిబ్బంది. సినియర్ సిటిజన్లు, వ్యాపారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వినాయకుని ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

పలమనేరు టౌన్ 23, ప్రభాతవార్త:



ఈ నెల 27న వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయకుని విగ్రహాలు, మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పని సరిగా వుండాలని శనివారం ఎస్ఐ స్వర్ణతేజ తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వం వెబ్‌సైట్ ఏర్పాటు చేసింది. గణేష్ ఉత్సవ్ గాట్‌నెట్ అనే వెబ్‌సైట్ ఓపన్ చేసి మీ ఫోన్ నెంబర్ ఎంటర్ చేస్తే ఒటిపి వస్తుంది. ఒటిపిని లాగిన్ చేసి మీ పేరు, లోకేషన్, వినాయకుని విగ్రహం మండపం ఏర్పాటు స్థలం, ఏ రోజు నుండి ఏరోజు వరకు ఉంటుంది. నిమజ్జనం ఎప్పుడు చేస్తారు మరో 5 మందిపేర్లు, వారి ఫోన్ నెంబర్లు ఇతర వివరాలు ఎంటర్ చేసే పోలీస్ స్టేషన్‌కు వస్తుంది. ఈ వివరాలు కూడా డౌన్‌లోడ్ చేసి జిరాక్స్ కాపీని మండపంలో ఉంచుకోవాలి. నిమజ్జనం సమయంలో తగిన జాగ్రత్తలు వహించాలని ఎస్ఐ స్వర్ణతేజ తెలిపారు.

## నేడు కాశీవిశ్వరుని ధ్వజస్థంభ వృక్షం రాక

పలమనేరు టౌన్, ఆగస్టు 23, ప్రభాతవార్త:

పలమనేరు పట్టణంలోని కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో జరుగుతున్న ఆలయ పునరుద్ధరణలో భాగంగా కొత్తగా గాలిగోపురం, ధ్వజస్థంభం ఏర్పాటు చేస్తారు. ఇందులో భాగంగా కేరళ రాష్ట్రం పరశురామ క్షేత్రం నుండి నూతన ధ్వజస్థంభ వృక్షం బయలు దేరి ఈ నెల 24న ఆదివారం ఉదయం 9 గంటలకు పలమనేరుకు వస్తుంది. మదనపల్లెరోడ్డు, లింగాయతువీధి, బజారువీధి, జిలానీ సర్కిల్, రంగాపురం, టమోటా మార్కెట్, రంగబాబు సర్కిల్ మీదుగా పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుతుంది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కార్య నిర్వహణ అధికారి, అర్చకులు కోరుతున్నారు.

## బిసి కాలనీలో వైభవంగా అమ్మవారికి అమావాస్య పూజలు

పలమనేరు, ఆగస్టు 23, ప్రభాతవార్త:

గంటావూరు బిసి కాలనీలో శనివారం మారెమ్మ అమ్మవారికి ఆమావాస్య పూజలు వైభవంగా నిర్వహిం చారు. అమ్మవారిని ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, పూలు, సుగంధ ద్రవ్యాలతో అలంకరించి బ్యాండు వాయి ద్యాలతో పూజలు అభిషేకాలు చేశారు. ముత్తైదువలు తలంబ్రాలతో పసుపుకుంకుమలతో, టెంకాయ కర్పూరాలు హారతులతో పూజలు చేసి చీరలు సారెలు సమర్పించారు. మధ్యాహ్నం మురుగన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

## వినాయకచవితిని భక్తిశ్రద్దలతో జరుపుకోండి

చిత్తూరురూరల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:



ఈనెల 27వ తేదిన వినాయక చవితిని ప్రజలు భక్తిశ్రద్దలతో జరుపుకోవాలని నగర గణేష్ ఉత్సవ సమితి సభ్యులు కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌నందు వారు మాట్లాడుతూ పండుగను ప్రజలందరూ ఐక్యమ త్యంతో సాంప్రదాయ పద్దతిలో నిర్వహించుకోవాలని, వివిధ ప్రాంతాలలో కొలువుదీరనున్న మండపాల వద్ద ఎటువంటి అశ్లీలతలకు చోటు కల్పించకుండా భక్తి పాటలను మాత్రమే వేయాలన్నారు. ముఖ్యంగా పోలీసుశాఖకు నిర్వాహకులు సహకరించి వారి నియమనిబంధనలను పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో రామభద్ర, గోల్లహరిప్రసాద్‌చౌదరి, షణ్ముగం, తోళపాళ్యంవెంకటేష్, జయచంద్ర, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్ కొడుతున్న బోర్ స్టాటర్



-పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు

-భయందోళనతో గ్రామస్థులు

పూతలపట్టు, ఆగస్టు 23, ప్రభాతవార్త

మండలంలో పి కొత్తకోట గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్నా చవటపల్లి హరిజనవాడలో గత 4 రోజులుగా గ్రామంలో ఉన్నా త్రాగు నీరు బోర్ స్టాటర్ షాక్ కొడుతుంది. గ్రామ ప్రజలు పంచాయితీ అధికారులకు తెలియపరిచిన ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురకు షాక్ కొట్టి హాస్పిటల్ వెళ్లి చికిత్స చేయించుకొని వచ్చామని చెబుతున్నారు. ఈ వర్షా కాలంలో నీళ్ల రానప్పుడు బోరు స్టార్టర్ నొక్కడానికి పోతే ఎక్కడ విద్యుత్ షాక్ గురవుతాము అని భయపడుతూ బ్రతుకుతున్నామని గ్రామస్థులు చెబుతున్నారు. పడుతున్న వర్షాలు కారణంగా గ్రామస్తులు స్థానికలు సమస్యలు పై అధికారులు తెలియపరిచినా ఏ మాత్రం స్పదించకపోవడంతో మాగోడు ఎవరికి చెప్పుకోవాలి స్థానికలు మండిపడుతున్నారు.

## ప్రమాణాలతో దద్దరిల్లిన రాజనాలబండ

చౌడేపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త



సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాబం డపై శనివారం ప్రమాణాల జోరు కొనసా గింది. రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో కక్షిదారులు తరలి రావడంతో బండపై రద్దీ కనిపించింది. ప్రధానార్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీనం సింహస్వామి, క్షేత్ర పాలకుడు ప్రసన్న అంజనేయ స్వాములకు విశేష పూజలు నిర్వహించారు. మదనపల్లి, నిమ్మనపల్లి, రాజులూరు తదితర ప్రాంతాల నుంచి అనుమానితులు, సొమ్ము పోగొట్టుకొన్నవారు వచ్చారు. కొందరు ప్రమాణాలు చేయగా మరికొందరు వాయిదా వేసుకొని వెళ్లారు. టిటిడి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ భానుప్రకాష్, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## ప్రతిభావంతులకు కలెక్టర్‌చే ప్రశంసా పత్రాలు

చౌడేపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త



విద్యలో ప్రతిభ కనబరచిన గురుకుల పాఠశాల విద్యార్థిణులకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చేమకూరి ఉత్తమ ప్రశంసా పత్రాలందించారు. క్రెడిట్ ఆక్సిస్ ఇండియా పౌండేషన్ వారిచే గ్రామీణ విద్యను ప్రోత్సహించే క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదిలో ఉత్తమ ప్రతిభ కనబరచని విద్యార్థిణులకు రూ. 10వేలను ప్రోత్సాహక బహుమతులుగా అందించారు. ఎంపిక చేయబడ్డ 8మంది విద్యార్థుల్లో చౌడేపల్లి మండలం గడ్డంవారిపల్లి పంచాయతీ బత్తలాపురంకు చెందిన హరినాథ్, ముకుందల కుమార్తెలు రెడ్డిరాణి, భవ్యశ్రీలకు కలెక్టర్ శ్రీధర్ చామకూరి నగదుతోపాటు ప్రశంసా పత్రాలందించారు. సంస్థ ప్రతినిధులు జగదీష్, హనుమంతయ్య, సుంకన్న, మధుసూదన్‌రెడ్డిలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతులకు జీలగలు,నవధ్యానాల పంపిణి



**తొట్టంబేడు,ఆగస్టు 23 ప్రభాతవార్త** తొట్టంబేడు మండలంలోని ఇలగనూరు గ్రామంలో శనివారం రైతులకు జీలగలు, నవధాన్యాలను వ్యవసాయశాఖ అందించారు.ఈ కార్యక్రమాలకుముఖ్య అతిథిగా మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు గాలిమురళినాయుడు హాజరయ్యారు.ఈ సందర్భంగా మురళి నాయుడు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం ంరైతు సంక్షేమ ప్రభుత్వం అన్నారు. ఏ సీజన్లో రైతులకు ఏది అవసరమో అది అందిస్తుందన్నారు. రైతులను ఆర్థికంగా అదుకొనుటకు అన్నదాతసుఖీభవ పథకంలో నగదు బదిలి చేసారన్నారు. ప్రస్తుతం రైతులకు50శాతం సబ్సీడీలతో జీలగలు అందించారన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని భూమి సత్తువ కోసం జీలగలు,జనుము వేయటం ఆనవాయితి అన్నారు. గతంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వం రైతులకు గోపాలకృష్ణారెడ్డి సారధ్యంలో వరికొత యంత్రాలు,రైతు రధాలు, టార్బాలియన్లు, నాగళ్ళు,స్ప్రేయర్లు, పనిముట్లును అందించారన్నారు. ఆయన తనయుడు రైతులకు డ్రోన్లు అందించారన్నారు.

**యూరియా కొరత:**

ఈ సమావేశంలో మురళి నాయుడుమాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయం ఊపందుకుందని అయితే ఇక్కడ రైతులకు తగినంత యూరియా అందుబాటులో లేదన్నారు. అలాగే ఎరువులు కూడా తగినంత అందించాలని కోరారు.ఈ సమస్యను తానుస్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని వివరించారు.మిల్లర్లకు లెవీ ఇవ్వనందువల్ల ంరైతులకు గిట్టుబాటు ధరలు ఉండటం లేదన్నారు. ఈ అంశాన్ని ఎంఎల్ఏ అధినాయకుల దృష్టికి తీసుకురావాలని మురళినాయుడు కోరారు.ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ మధునాయుడు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు పవన్, వినాయతుల్లా, రైతులు నాగూర్, కుమారస్వామి, సుబ్రమణ్యంలకు విత్తనాలు అందించారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచండి



భాకరాపేట :ప్రభాతవార్త

:చిన్నగొట్టిగల్లు మండల కేంద్రం లో ఈఓ పి ఆర్డీ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు అందులో భాగంగా అయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ఉన్నందున దోమలు ఎక్కువ గా ఉంటాయి కాబట్టి పరిసరాలు శుభ్రం గా ఉంచుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సర్పంచ్ మనోహర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

## దివ్యాంగుల ప్రతిభకు వేదిక ప్రేరణ సొసైటీ.



**తిరుపతి విద్య ఆగస్టు 23 ప్రభాత వార్త.** స్థానిక మహతి కళాక్షేత్రం వేదికగా శనివారం జరిగిన"ప్రేరణ సహృదయ" కార్యక్రమం ప్రతి ఒక్కరినీ మనసుని తాకేలా చేసింది. నవజీవన్ బ్లైండ్ రిలీఫ్ సెంటర్,శ్రీ వెంకటేశ్వర డెఫ్ అండ్ డంబ్ స్కూల్, పాస్ మనోవికాస్,రాస్, అక్షయ క్షేత్రం లాంటి సంస్థల నుండి వచ్చిన 90 మంది చిన్నారులు తమ ప్రతిభను ప్రేక్షకుల ముందుంచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీలత,డి.ఎస్.పి మహిళా పోలీస్, తిరుపతి మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా యువత ముందుండి ఈ సంస్థను నడిపిస్తూ, ప్రత్యేక ప్రతిభావంతులు అయిన పిల్లలకు మద్దతుగా నిలుస్తుండటం అనేది మామూలు విషయం కాదు" అని ప్రశంసించారు.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయానికి నిరంతరంగా సేవలందిస్తున్న బాపా రావు పర్యావరణ పరిరక్షణపై సామాజిక చైతన్యం పెంచుతున్న బాబు ని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం వెనుక ఉన్న హృదయాల జాబితాలో – సుమశ్రీ,హేమంత్, సరితా,అఖిల్,ఉదయ్, ఇతర ప్రేరణ సభ్యుల కృషిని ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. వారు కేవలం ఈ కార్యక్రమాన్నే కాకుండా, ప్రతి చిన్నారి ముఖంలో చిరునవ్వు చూడాలనే లక్ష్యాన్ని కూడా విజయవంతం చేశారు. ఈరోజు ప్రదర్శనల్లో కళ మాత్రమే కాదు మానవత్వం, ప్రేమ, దయ,శ్రద్ధ అన్నీ కనిపించాయి.

## మాదక ద్రవ్య దుర్వినియోగంపై అవగాహన



***తిరుపతి హెల్త్, ఆగస్టు 23 ప్రభాతవార్త :*** మాదక ద్రవ్యాల దుర్వినియోగం,యువతతో విస్తరిస్తున్న ఒక తీవ్రమైన సామాజిక సమస్య. ఈ సమస్యను అరికట్టేందుకు కృష్ణతేజ ఫార్మసి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో చంద్రగిరి డీఎస్పీ బి. ప్రసాద్, సీఐ, సునీల్‌కుమార్, ఎస్.ఐ ఎం. అరుణ ఇతర సిబ్బంది మాదక ద్రవ్యాల దుష్పరిమాణాలు, చట్టపరమైన చర్యలు వాటివల్ల కలిగే సమస్యలపై విస్తృత అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. జయశంకర్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. ఉమాశంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సి. భువనేశ్వరరావు, ఈగల్ టీమ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం. దివ్య పాల్గొన్నారు.

## గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న మహిళ అరెస్ట్

### రూ. 66,000 వేలు విలువైన గంజాయి స్వాధీనం

**పుత్తూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త :** గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నగరి రూరల్ మండలం ఒ.జి.కుప్పం గ్రామం జగనన్న కాలనీకి చెందిన ఒక మహిళను పుత్తూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఎస్ఐ టి.ఓబయ్య తెలిపిన వివరాల మేరకు...ఒ.జి.కుప్పం గ్రామానికి చెందిన పి.లింగేశ్వరి (47) ఒడిస్సా రాష్ట్రానికి వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి సుమారు 11 కిలోల ఎండిన గంజాయిని ఒక కిలో రూ. 6000 వేలు చొప్పున కొనుగోలు చేసి ట్రైన్‌లో రేణిగుంట వరకూ వచ్చి, అక్కడ నుంచి పుత్తూరుకు బస్సులో వచ్చింది. పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో హెచ్‌పి పెట్రోలు బంక్ వద్ద నగరి వెళ్లేందుకు బస్సు కోసం వేచి వుండగా ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ ఓబయ్య పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఆమె నుంచి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

## భావిభారత పౌరులకు ఈ దుస్థితి తగదు..!

### ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు జి.తేజ

చంద్రగిరి, ఆగస్టు 23 ప్రభాతవార్త:

చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల భావిభారత పౌరులకు ఇటువంటి దుస్థితి తగదని ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు జి.తేజ అన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థుల మంచినీటి సమస్యపై ఆయన శనివారం ఇక్కడికి చేరుకుని విద్యార్థుల ఇబ్బందులను స్వయంగా చూశారు. కళాశాలలోని వాటర్ ప్యూరిఫైయర్ మరమత్తులకు గురికావడంతో విద్యార్థులు వాటర్ క్యాన్‌లతో కళాశాల వెలుపల నుండి మోసుకుని తీసుకురావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం రూ.15 వేలు నుండి రూ.2 వేలు కళాశాల అభివృది కొరకు తీసుకుంటున్నప్పటికీ ఇటువంటి దుస్థితిని విద్యార్థులు ఎదుర్కోవడం సిగ్గుచేటన్నారు. దాదాపు 300 మంది విద్యార్థులకు మంచినీటి సమస్య వున్నప్పటికీ ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వాటర్ ప్యూరిఫైయర్‌ను మరమత్తు చేయించి, విద్యార్థులకు నీటి ఇబ్బందులను తొలగించాలని కోరారు.

## లబ్దిదారులకు ఊరట కలిగించిన కలెక్టర్



***తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 23 ప్రభాతవార్త :*** తిరుపతి అర్బన్ మండలం చెన్నయ్య గుంట గ్రామ దాఖలా సర్వే నెంబరు 194/6ఏ లోని శేషాచలం హిల్ వ్యూ తుడా లే అవుట్ ఫేస్–2 నందు కల 57 ఫ్లాట్స్‌లను నిషేధిత జాబితా నుండి తొలగించి లబ్దిదారులకు ఊరట కలిగించిన కలెక్టర్ వెంకటేశ్వర్‌ని శేషాచలం హిల్ వ్యూ లేఅవుట్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి కలెక్ట ర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత పది సంవత్సరాల బాధ నుండి విముక్తి కలిగించి తమ కోరిక నెరవేర్చి నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ప్రెసిడెంట్ ఎం. మోహన్‌రావు, సెక్రటరీ ఏవీ రమణశర్మ, సభ్యులు రాజేంద్రప్రసాద్,లక్ష్మి,కె. కార్తీక్, వై. రమణ, ప్రభాకర్‌రెడ్డి, జ్యోతి కృష్ణ, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

## శివశంకర్‌కి డాక్టరేట్ పురస్కారం



తిరుపతి విద్య, ఆగస్టు 23 ప్రభాతవార్త.

తిరుపతి వాస్తవ్యుడైన జొన్నలగడ్డ శివ శంకర్ చిన్న వయస్సు నుండే సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు " మార్క్స్ హెల్త్ కేర్ ఫౌండేషన్ " వైస్ ఛైర్మన్ గా సేవలందిస్తూ, తిరుపతి జిల్లా లో ఉచిత డైగ్నోస్టిక్ హెల్త్ కేర్ ఎటిఎం సెంటర్, ను ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఉచిత వైదసేవలు అందిస్తున్నారు. ఈ వైద్య సేవలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లల్లో ఈ హెల్త్ కేర్ సెంటర్ల ఏర్పాటుకు కూడా కృషి చేస్తున్నందుకు గాను అమెరికన్ డెలవర్ స్టేట్ యూనివర్సిటీ వారు చెన్నై లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియం నందు డాక్టరేట్ పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మార్క్స్ హెల్త్ కేర్ ఫౌండేషన్ స్టాఫ్, మరియు బోర్డు సభ్యులు పాల్గొన్నారు...

## చిరంజీవి కి డాక్టరేట్ పురస్కారం



తిరుపతి విద్య, ఆగస్టు 23 ప్రభాత వార్త:

చిత్తూరు జిల్లా యస్. ఆర్. పురం మండలం, సుపర్వరాజపురానికి చెందిన ఘట్టం చిరంజీవి ఉద్యోగరీత్యా లండన్ లో స్థిరపడినా స్వదేశం పైనున్న మమకారం తో " మార్క్స్ హెల్త్ కేర్ ఫౌండేషన్ "సి ఇ. ఓ గా సేవలందిస్తూ తిరుపతి జిల్లా లో మొట్ట మొదట గా ఉచిత డైగ్నోస్టిక్ హెల్త్ కేర్ ఎటిఎం సెంటర్, ను ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఉచిత వైదసేవలు అంది స్తున్నారు.ఈ వైద్య సేవలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లో ఈ హెల్త్ కేర్ సెంటర్ల ఏర్పాటుకు కూడా కృషి చేస్తున్నందుకు గాను అమెరికన్ డెలవర్ స్టేట్ యూనివర్సిటీ వారు చెన్నై లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియం నందు డాక్టరేట్ పురస్కారాన్ని అందించారు.చిరంజీవి కి డాక్టరేట్ పురస్కారం వరించడాన్ని పలువురు ప్రశంసించి,అభినందించారు.ఈ కార్యక్రమం లో కుటుంబ సభ్యులు,మార్క్స్ ఫౌండేషన్ స్టాఫ్, మరియు బోర్డు సభ్యులు పాల్గొన్నారు...

## ముందస్తు జాగ్రత్తలు తీసుకుందాం: ఆరోగ్యంగా ఉందాం




**శ్రీకాళహస్తి, ఆగస్టు 23 ప్రభాతవార్త** రాబోవు వర్షాకాలంలో సోకే రక రకాల వ్యాధులను ముందస్తు జాగ్రత్తలతో ఎదుర్కొంటామని ఆరోగ్యంగా ఉందామని నినాదాలు చేస్తూ శనివారం శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో అధికారులు ప్రజా ప్రతినిధులు చైతన్య ర్యాలి నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ భవాని ప్రసాద్ అధ్యక్షతన ర్యాలిని ప్రారంభించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్, కార్యదర్శి కాసరం రమేష్ సారధ్యంలో ర్యాలి నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, విజయకుమార్ మాట్లాడుతూ వాతావరణం మారి వర్షాకాలం వస్తుందంటే రక రకాల జ్వరాలు సోకుతాయని అయితే మనం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. అందుకు దోమల బారి నుంచి మనల్ని మనం కాపాడుకొనుటకు మున్సిపల్ భాధ్యతగా దోమల నివారణకు ఫాగింగ్‌చేస్తుందన్నారు. అలాగే మురుగునీటి కాలుల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తున్నామని వివరించారు.దోమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో త్వరలో ఫైరింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అయితే ప్రజలు తమ ఇళ్ళ ముందు మురికి నీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకొని మున్సిపాలిటితో సహాకరించాలని కోరారు. క్లీన్ సిటిగా తీర్చిదిద్దటానికి ప్రజలు వ్యాపారులు తమచెత్తలను రోడ్ల మీద వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ర్యాలి మున్సిపాలిటి నుంచి పాతవరదయ్యపాళెం రోడ్డు,జయరామారావు వీధి, బజారు వీధి, తేరువీధి, నెహ్రూవీధిలు మీదుగాసాగింది.ఈ ర్యాలిలో మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్,డిఇఇ సంజీవ్‌కుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాల,మెప్మా సిబ్బంది తెలుగుదేశం నాయకులు వాకచర్ల గుర్రప్పశెట్టి,ఖాదర్‌బాషా, పోలూరు శ్రీనివాసులురెడ్డిడివి నారాయణ, షాకీర్ అలి,కిట్టు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రమాణం చేసారు.

## వైకాపా నాయకునికి శ్రద్ధాంజలి



**శ్రీకాళహస్తి రూరల్,ఆగస్టు 23 ప్రభాతవార్త** ఏర్పేడు మండలంలో సీనియర్ వైకాపా నాయకుడు రెడ్డివారి సుబ్బారెడ్డి హఠాన్మరణం చెందారు.ఆయన మృతదేహానికి ఎంపి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నివాళుల ర్పించారు.వారి కుటుంబాన్ని ఓదార్చారు.ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మండలంలో పార్టీని నడిపించటంలో సుబ్బారెడ్డి ఎంతో కీలకంగా ఉండేవారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఆ కుటుంబాన్ని వైకాపా ఆదుకుంటుందని సిపాయి సుబ్రమణ్యం అన్నారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. మండలంలోని పాతవీరాపురానికి చెందిన సుబ్బారెడ్డి గ్రామావృద్ధికి పాటు పడ్డారన్నారు. ఎంఎల్‌సితో పాటు మాజీ ఎంపిటిసి మునిరత్నం రెడ్డి, రెడ్డివారి మోహన్‌రెడ్డి, పాతగుంట గురువారెడ్డి, మునస్వామిరెడ్డి, జయశంకర్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి,రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చెంబేడు కాలువకు మోక్షం



**శ్రీకాళహస్తి,ఆగస్టు 23 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని మురుగునీటిని తరలించే చెంబేడు కాలువకు మోక్షం వచ్చింది. ఈ కాలువలోకి పట్టణంలోని మురుగునీరంతా చేరుతుంది. దాంతో ఈ కాలువలో పట్టణంలోని వ్యర్థాలు చేరి చూడటానికి ఇబ్బందిగా మారింది. ఇటీవల 'శివం టు శివం రోడ్లు' పనులను పరిశీలించుటకు వెళ్ళిన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆవాక్యయ్యారు. దాంతో మున్సిపల్ అధికారులతో కాలువల్లో ఇలా వ్యర్థాలు పేరుకుపోతే జనాలకు రోగాలు కాకుండా ఏ మొస్తుందని ప్రశ్నించారు. వెంటనే క్లీన్ చేయించాలని ఆదేశించారు.దాంతో స్పందించిన కమిషనర్ భవాని ప్రసాద్ తన శానిటేషన్ ఇన్స్‌పెక్టర్‌బాల వారి సిబ్బందితో సమావేశం జరిపి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. దాంతో శనివారం చెంబేడు కాలువ అవుట్ లెట్ నుంచి శుభ్రం చేయటం మొదలెట్టారు. పట్టణంలోని మురుగునీటితో పాటు వ్యర్థాలుకూడా సర్ణముఖి నదిలోకి చేరుతున్నాయి. ఈ నది నుంచి పంట పొలాలకు సాగు నీరందించే చెంబేడు కాలువలోకి వెళుతుంది. ఈ దుస్థితికి శనివారం కొంత ఉపశమనం కల్గిందని చెప్పవచ్చు.

## బిజెపి ఉపాధ్యక్షుని ఇంట కోలాహలం:అభినందనల సంబరాలు



**శ్రీకాళహస్తి,ఆగస్టు 23 ప్రభాతవార్త** రాష్ట్ర బిజెపి కార్యవర్గంలో యువ నాయకుడు కోలా ఆనంద్‌కు ఉపాధ్యక్ష పదవి వరించటంతో ఆయన అభిమానుల్లో సంబరాలు చోటు చేసుకున్నాయి. శనివారం ఉదయం నుంచి పట్టణంలోని సంతమైదనంలో ఆయన అభిమానుల్లో ఆనందోత్సాహాలు చోటు చేసుకున్నాయి., గ్రామాల నుంచి వచ్చిన యువకులు కూడా బాణ సంచా కాలుస్తూ శుభాకాంక్షలు తెలుపుతూ కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఇక పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని యువకులు గతంలో ఆయన వద్ద లబ్ధి పొందిన వారు కదలి వచ్చి ఆనంద్‌ను సన్మానాల్లో ముంచెత్తారు. పూల మాలలు, దుశ్శాలువలతో ఆయన ఇల్లు నిండిపోయింది. పొద్దుపొడవక ముందే వాకర్స్ అసోసియేషన్ కు చెందిన టీం న్యాయవాది చలమయ్య,లోకనాధం, గాజుల సత్యానారాయణ వారి అనుచరులు ఇంటి వద్ద సత్కరించారు. అక్కడ నుంచి వివిధ సంఘాలకు చెందిన వారు,వివిధ వర్గాల వారు ఆయన ఇంటి వద్ద సందడి చోటు చేసుకుంది. ఎవరికి ఏ అవసరం వచ్చినా నేనున్నానని పలకరించే ఆనంద్‌కు అభిమానుల సంఖ్య అత్యధికం.

## ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో వెజిటబుల్ డే

శ్రీకాళహస్తి,ఆగస్టు 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని ఆక్స్‌ఫర్డ్ కార్పొరేట్ పాఠశాలలో శనివారం వెజిటబుల్స్ డేను నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులకు వెజిటబుల్స్‌పేర్లను టీచర్లు అవగాహనకల్పించుటకు బొమ్మలను తయారు చేసి వారి ద్వార ప్రదర్శింప జేసారు. క్యారెట్,టమోటా, వంకాయ,పచ్చిమిర పకాయ, ఉల్లగడ్డల పేర్లను వివరించారు. పాఠశాల అవవరణలోని సరస్వతి దేవి విగ్రహం వద్ద ప్రదర్శన జరిపి తల్లదండ్రులను ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమాలను పాఠశాల ప్రైమరి ఇన్‌చార్జి శ్రీలత, యుకెజి టీచర్ జీవిత ఎల్‌కెజి టిచర్ సుమతి,అనితల సారధ్యంలో విద్యార్థులకు చైతన్యం కల్గించారు

## సరస్వతి కండ్రిగలో వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



**శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 23 ప్రభాతవార్త** ఏర్పేడుమండలం సరస్వతి కండ్రిగలో శనివారం గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు జరుకున్నారు. నెల్లూరుకు సమీపంలో గొలగమూడి గ్రామంలో వెలసిన అవదూత వెంకయ్యస్వామి.ఇక్కడకు నిత్యం వేలాది మందిభక్తులు వస్తూ తమ మొక్కులను తీర్చుకుంటుంటారు. ఇక్కడకు వచ్చేభక్తుల కోసం సకల సదుపాయాలను కల్పిస్తున్నారు.ఇదో పుణ్యక్షేత్రంగా మారింది.ఇక్కడకు శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి ఆరాధనోత్సవాలకు భారీ ఎత్తున ప్రత్యేక ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని వెళతారు.ఈ నేపధ్యంలోఏర్పేడు మండలం సరస్వతి కండ్రిగ గ్రామంలో శనివారం అంగరంగ వైభవంగా జరిపారు. వెంకయ్యస్వామి చిత్రపటాలకు పూజలు జరిపారు.మధ్యాహ్నం సహపంక్తి భో జనాలు నిర్వహించారు.

## శనీశ్వరునికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి,ఆగస్టు 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి శనీశ్వరాలయం వద్ద భక్తులు నువ్వుల నూనె, నువ్వులతో పూజలు నిర్వహించారు. ఆలయం తరపున షోడషాభిషేకాలు నిర్వ హించారు. మధ్యాహ్నం వరకు అమావాస్య ఘడియలు ఉండటంతో భక్తులు తండో పతండాలుగా హాజరయ్యారు. వచ్చిన భక్తులు నిరాశ చెందకుండా ఆలయాధి కారులు అభిషేకాలకు అవకాశం కల్పించారు. దక్షిణ భారత దేశంలో ఎక్కడా లేని విధంగాశనీశ్వరస్వామికి విగ్రహం, శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసి భక్తుల కొంగు బంగారంగా వరాలిస్తూ పూజలం దుకుంటున్నారు.

## బోనుపల్లిలో శుకబ్రహ్మాశ్రమం కంటి వైద్యశిబిరం



***తొట్టంబేడు, ఆగస్టు 23 ప్రభాతవార్త*** మండలంలోని బోనుపల్లి గ్రామంలో శనివారం శుకబ్రహ్మాశ్రమం సారధ్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆశ్రమంలోని భక్తకన్నప్ప కంటి వైద్యశాల అధ్వర్యంలో చుట్టుపక్కల గ్రామాల్లో ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించటం అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహించటం జరుపుతున్నారు.ఈనేపధ్యంలో ఈ నెల కార్యక్రమాల్లో భాగంగా ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానంద గిరి స్వామి బోనుపల్లి గ్రామాన్ని ఎంపిక చేసారు. ఇక్కడ వైద్యపరీక్షలు జరుపుకున్న విద్యార్థులకు విటమిన్ గుళికలు అందించారు. సుమారు వందమందికి పైగా వైద్యపరీక్షలు జరిపిన డాక్టర్లు కొందరికి శస్త్ర చికిత్స అవసరమని భావించి భక్తకన్నప్ప ఆసుపత్రికి రెఫర్ చేసారు.ఈ కార్యక్రమాలను ట్రస్టు కోఆర్డినేటర్ దొర కుమార్, కంటివైద్యనిపుణులు డాక్టర్ జయచంద్రప్ప వైద్యపరీక్షలు జరుపుగా ప్రధానోపాధ్యాయులు భారతి, మాజీ సర్పంచ్ దావులూరు రామానాయుడు,ఉపాధ్యాయులు మనోహర్‌రెడ్డి,శంకర్‌రెడ్డి, పవన్‌కుమార్, వైద్యసిబ్బంది నందిని టిడిపి కార్యకర్త కత్తి బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు

## మీ ఆత్మీయత ఎనలేనిది

### ఆజన్మాంతం మరువలేనిదిగంగపల్లి, బన్నీలకు ఘననివాళి మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్‌బాషా

చంద్రగిరి, ఆగస్టు 23 ప్రభాతవార్త:

మీ ఆత్మీయత ఎనలేనిది, ఆజన్మాంతం మరువలేనిదని మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్‌బాషా అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో దివంగత టిడిపి మాజీ మండల ప్రధాన కార్యదర్శి గంగపల్లి భాస్కర్, టిడిపి మాజీ తెలుగుయువత మండల అధ్యక్షుడు భానుప్రకాష్ రెడ్డి (బన్నీ) 4వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతం చేయడంలో వీరి సేవలు ఆదర్శనీయమన్నారు. అభాగ్యులకు చేయూత నివ్వడం ద్వారా విశిష్ట సేవలందించినట్లు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు మొక్కల కుమార్ రాజారెడ్డి, నాదముని రెడ్డి, పెరుమాళ్ పల్లి రఘునాధరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అర్థగణాంక శాఖ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా గోవర్ధన్



***తిరుపతిరూరల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:*** ఎకనామిక్, స్టాటిటిక్స్ సబార్డ్‌నేట్ అసోసియేషన్ తిరుపతిజిల్లా అధ్యక్షుడుగా గోవర్ధన్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎకనామిక్,స్టాటిటిక్స్ సబార్డ్‌నేట్ అసోసియేషన్ తిరుపతిజిల్లా కార్యవర్గ ఎన్నికలు జరిగిన విషయం విదితమే. జిల్లా అధ్యక్షుడుగా బి.గోవర్ధన్ యాదవ్ (ఎఎస్ఓ తిరుపతిరూరల్), కార్యధర్శిగా మస్తాన్‌బాబు (ఏఎస్ఓ నాయుడుపేట మండలం), ఉపాధ్యక్షులుగా స్వర్ణలత (చంద్రగిరి మండలం), కోశాధికారిగా రామరాఘవరెడ్డి (ఏఎస్ఓ నాగలాపురం మండలం), సంయుక్త కార్యధర్శిగా వై.శ్రీనివాసరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి జిల్లా ఆర్థగణాంకశాఖ అధికారి అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఉన్నటువంటి అర్థగణాంక శాఖ సభ్యులు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే వారి అభ్యున్నతికి పాటుపడతానని తెలిపారు.

## వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి



**తిరుపతి విద్య, ఆగస్టు 23 ప్రభాతవార్త** తిరుపతి నగరంలోని ప్రముఖ వినోద కేంద్రం బాబు జగజీవన్‌రావు పార్క్‌లో అవసరమైన మరమ్మతులు, సదుపాయాల మెరుగుదల కోసం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మోర్యకు వినతి పత్రం సమర్పించామని కస్తూర్బా గాంధీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పిసి రాయలు తెలియజేశారు.శనివారం బాబు జగజ్జీవన్ రావు పార్క్ ను తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు,తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి,నగరపాలక సంస్థ కమిషనర్ మోర్య సందర్శించారు.పార్కులో పాడైన బెంచీలు, లైటింగ్ సదుపాయాలు, నడక మార్గాల పునరుద్దరణ,నీటి సదుపాయం వంటి అంశాలను తక్షణం పరిష్కరిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా పిసి రాయాలు మాట్లాడుతూ ఉదయం,సాయంత్రం వందలాది మంది వాకర్స్,పిల్లలు,వృద్ధులు ఉపయోగించే ఈ పార్క్‌లో శ్రద్ధ వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను అభ్యర్థించారు. కుటుంబాలు,పిల్లలు,వృద్ధులకు ఉపయోగపడే ఈ పార్కు అభివృద్ధి మరింత అందంగా తీర్చిదిద్దినందుకు బాధ్యులందరికి అభినందనలు తెలిపారు.ప్రజల ఆరోగ్యం,విశ్రాంతి కోసం పార్క్ కీలక పాత్ర పోషిస్తుందని,నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

## శ్రీ వకుళమాత అమ్మవారికి సారె సమర్పణ

తిరుపతిరూరల్,ఆగస్టు 23 ప్రభాతవార్త:

శ్రావణ మాసంలో ఆఖరి శనివారం సందర్భంగా పేరూరు బండపై వెలసిన శ్రీవకుళమాత అమ్మవారికి రాయలసీమ రంగస్థలి చైర్మెన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి సారె సమర్పించారు. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం అనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా గోఫీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సాక్షాత్తు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి తల్లిగారైన శ్రీవకుమాళమాతకు శ్రావణ మాసంలో చివరి శనివారం సారె సమర్పించి, ప్రత్యేక పూజ, మొక్కులు తీర్చుకోవడం జరుగుతుందని తెలిపారు. అమ్మవారి దీవేనలతో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిత్రపు హనుమంత్‌రావు, స్వరాజ్యలక్ష్మీ, వాసుదేవరెడ్డి, జయలక్ష్మీ, లక్ష్మీరంగనాధన్, లీలావతి, చెంగారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మునినాథరెడ్డి, వాసు, నరేష్‌నాయుడు, మునేంద్రరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భాష్యం బ్లూమ్స్ సిబిఎస్‌సి పాఠశాలలో పదవీ ప్రదాన కార్యక్రమం

తిరుపతి విద్య, ఆగస్టు 23 ప్రభాతవార్త..

భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అనుమతి మేరకు శనివారం బ్లూమ్స్ సీబీఎస్‌సి పాఠశాలలో పదవీ ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భాష్యం విద్యా సంస్థల సీఈఓ హనుమంతరావు ఎన్నికైన విద్యార్థులను అభినందిస్తూ, తమ బాధ్యతలను కర్తవ్యనిష్ఠతో నిర్వర్తించాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి జోన్ విద్యా పర్యవేక్షణ అధికారి లక్ష్మణ్ రావు, విద్యార్థులకు చిన్న వయసులోనే ఎన్నికల పట్ల అవగాహన కలిగించడం,నాయకత్వం అంటే ఏమిటి? ఒక నాయకుడి వద్ద ఉండాల్సిన లక్షణాలు ఏమిటి? అనే అంశాలపై స్పష్టమైన బోధన చేయడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భాష్యం విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్ పిలుపు మేరకు, అన్ని బ్రాంచ్‌లలో విద్యార్థి నాయకత్వ ఎన్నికలు నిర్వహించబడినట్లు పేర్కొన్నారు.ఈ ఎన్నికల ద్వారా హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ను ఎన్నుకొని, వారి ప్రమాణ స్వీకారం చేపించి బాధ్యతలు అప్పగించడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పూజ ఈ కార్యక్రమం ఉద్దేశం నిర్వహణ ఎన్నికల ద్వారా ఎన్నుకోబడిన హెడ్ బాయ్ హెడ్ గర్ల్ స్పోర్ట్స్ కెప్టెన్ హౌస్ కెప్టెన్స్ కు వారి విధులను తెలియ జేశారు. అందరూ క్రమశిక్షణ భాద్యత నిజాయతి నిబద్ధత తో కలిగిన ఆలోచన విధానం పెంచేందుకు ఈ ఎన్నికలు ఎంతో ఉపయోగకారం అందరూ గొప్ప నాయకులను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలి అన్నారు,ఈ సందర్భంగా విశిష్ట అతిధి రవి మనోహర్ చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేయబడ్డాయి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ



***కేవీబీ పురం, ఆగస్టు 23 ప్రభాతవార్త:*** మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినోత్సవం పురస్కరించుకుని అభిమానులు మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు. సినిమాల్లో హీరోగా కోట్లాది మంది హృదయాలను గెలుచుకున్న చిరంజీవి, వాస్తవ జీవితంలోను, సమాజసేవకే పెద్ద పీఠ వేసిన విషయం తెలిసిందే. ఆ దారిలో నడుస్తూ, ఆయన అభిమానులు నత్తం మాధవ్, కన్నయ్య ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సుమారు 50 మంది రోగులకు పండ్లు, బిస్కెట్లు, రొట్టెలు అందజేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని చూసిన స్థానికులు అభిమానులను అభినందించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి రజని, ఎంపీహెచ్‌వో రవిచంద్రరాజు, ఫార్మాసిస్టు సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది సుమియా, మెగాస్టార్ అభిమానులు మురళి, వెంకటస్వామి, ప్రతాప్, భూపతి, ఆకాష్, దాము, శీను తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిపైన విద్యుత్ వైర్లు - పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు

కేవీబీ పురం, ఆగస్టు 23 ప్రభాతవార్త:



ఇంటిపైన విద్యుత్ తీగలు ఉన్నాయని ఇంటి యజమానులు పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపినా ప్రయోజనం లేదని వారు ఆరోపిస్తున్నారు. అరచేత పట్టుకుని భయంతో జీవిస్తున్నామని,వారి దయనీయ పరిస్థితిని విలేకరులతో శనివారం వెల్లబుచ్చుకు న్నారు. మండల కేంద్రమైన కేవీబీ పురంలోని బీసీ కాలనీలోని ఇళ్ళ లోపల స్తంభాలు ఆ స్తంభాలపైనే విద్యుత్ వైర్లు ఉన్నాయని, అక్కడ నివసించే మునె మ్మ, శేఖర్, దొరస్వామి, పరిసర గ్రామస్తులైన పలువురు కుటుంబాల పరిస్థితిని విద్యుత్ వైర్ల వల్ల మిద్దెపైకి ఎక్కాలంటేనే భయంతో ఉన్నాయని, ఇబ్బందులు ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికి అందే ఎత్తులో వైర్లు ఉన్నాయని, పలుమార్లు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినా దీనిపై స్పందించడం లేదని వాపోయారు. ఇకనైనా స్పందించి ఇళ్ళపైన ఉన్న విద్యుత్ వైర్లను మార్చాలని కోరుతున్నారు.

## గీతా మందిరంలో ప్రవచనాలు



పుత్తూరు రూరల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశి వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గీతా మం దిరంలో శ్రీకృష్ణ జయంతి మహోత్సవ కార్యక్రమం సందర్భంగా శనివారం సాయంత్రం ఆలయ ఆవ రణలో తిరుపతి పట్టణానికి చెందిన శ్రీ కిషోర్ దాస్ వారిచే పుణ్యక్షేత్రం, పూరి క్షేత్రం, శ్రీ జగన్నాథ స్వామివారి లీలలు ప్రవచనం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే గోపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ గోపూజ ముత్తైదువలు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

## తిరుపతిలో టంగుటూరి జ్ఞాపకాలు



**తిరుపతి రవాణ ,ఆగస్టు 23ప్రభాతవార్త:** విద్యానే కంద్రం తిరుపతిలో స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు జ్ఞాపకాలు ఉన్నాయని బిజెపి నాయకులు తెలిపారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పుష్పా ంజలి ఘటించారు. బిజెపి నాయకులు గుండాల గోపీనా థరెడ్డి,తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, జయంత్‌కుమార్, బ్రాహ్మన కోఆపరేటివ్ అసిస్టెంట్ పిఆర్ఎల్‌కుమార్, క్యాషియర్ హారిక,చిత్రపు హనుమంతరావు పాల్గొని ప్రకాశంపంతులు జీవిత విశేసాలు తెలిపారు.నిరాందర జీవితానికి ఆయన ఆదర్శమన్నారు

**CHANGE OF NAME**

● I,SHAIK RAFI BASHA (Old Name), R/at DNO:6-2-19/1, Raovari Street, Naidupeta(M),Tirupati Dt,AP, changed my Name to SHAIK RAFI S/O KHADAR SAHED, Henceforth, I will be known as SHAIK RAFI ( New Name)

**CHANGE OF NAME**

● I,CHENNAMSETTY DILIP KUMAR (Old Name), R/at Kummarappalli(v),Piler(M), Annamayya Dt,AP, changed my name to CHENNAMCHETTY DILIP KUMAR S/o CHENNAMCHETTY HARI BABU. Henceforth, I will be known as CHENNAMCHETTY DILIP KMUAR (New Name).

# కార్మికుల ఆరోగ్య హక్కులపై రాజీ లేదు

## ఈఎస్ఐ హాస్పిటల్స్ పూర్తయ్యే వరకు పోరాటం : ఎంపీ మద్దెల గురుమూర్తి



వెంకటగిరి, ఆగస్టు 23, ప్రభాతవార్త

తిరుపతి పార్లమెంట్ పరిధి, నెల్లూరు జిల్లాలో కార్మికులకు, ఉద్యోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు కొత్త ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీలు ఏర్పాటు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్‌కి లేఖ రాసినట్లు తెలిపారు. ఆ లేఖకు సంబంధించి ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్ సమాధానమిచ్చారు. శ్రీ సిటీలో 100 పడకల కొత్త ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం కోసం భూమి సేకరణ ప్రతిపాదనను ఈఎస్ఐ కార్పొరేషన్ గత జూన్ నెలలో జరిగిన సమావేశంలో ఆమోదించిందని తెలియజేశారు. భూ సేకరణ పూర్తయిన తర్వాత వెంటనే ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమవుతుందని తెలిపారు. నెల్లూరు పట్టణంలో కూడా ఈఎస్ఐ సొంత భూమిలో 100 పడకల ఆసుపత్రి నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యామని, ఆసుపత్రి నిర్మాణం కోసం కాంట్రాక్టు ఇవ్వడం త్వరలోనే జరుగుతుందని పేర్కొన్నారు. తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రి విస్తరణకు సంబంధించి ఈఎస్ఐ కార్పొరేషన్ నిర్దేశించిన షరతుల ప్రకారం గత మూడు సంవత్సరాల్లో బెడ్ ఆక్యుపెన్సీ 70 శాతానికి మించి ఉండాలని, కానీ గత మూడు సంవత్సరాలలో బెడ్ ఆక్యుపెన్సీ తక్కువ నమోదవడంతో ప్రస్తుతం ఆసుపత్రి విస్తరణకు అర్హత రాలేదని చెప్పారు. అయితే భవిష్యత్తులో ఆక్యుపెన్సీ పెరిగితే విస్తరణ ప్రతిపాదనను మళ్లీ పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా మంజూరైన ఈఎస్ఐ డిస్పెన్సరీల విషయానికి వస్తే, రాష్ట్ర ప్రభుత్వం తగిన భూములు ఇవ్వడంలో ఆలస్యం చేస్తోందని, అయినా కూడా తాత్కాలికంగా అద్దె భవనాల్లో వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డైరెక్టర్ జనరల్ స్పష్టం చేశారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలలో అధిక సంఖ్యలో ఉన్న కార్మికులు, ఉద్యోగులకి తగిన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ఈఎస్ఐ హాస్పిటల్స్ ఏర్పాటు చాలా ముఖ్యమని అన్నారు. గతంలో ఇదే అంశంపై పార్లమెంటులో పలుమార్లు ప్రస్తావించిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. త్వరలోనే ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణం ప్రారంభమయ్యేలా కృషి చేస్తామని అన్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీలు కూడా తక్షణమే ప్రారంభమయ్యేలా ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించి కార్మికుల సంక్షేమం పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.

# గూడూరు డివిజన్

## అన్నా క్యాంటీన్లో అన్నం బాగాలేదు

### జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ



వెంకటగిరి, ఆగస్టు 23, ప్రభాతవార్త

అన్నా క్యాంటీన్లో అన్నం సరిగా లేదని జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను జూనియర్ సివిల్ జడ్జి ఆకస్మిక తనిఖీ చేశారు. అన్నా క్యాంటీన్లో అన్నం బాగాలేదని జూనియర్ సివిల్ జడ్జి క్యాంటీన్ సిబ్బందికి తెలిపారు. భోజనాన్ని కూరలను తిని జడ్జి రుచి చూశారు. అన్నం బాగాలేదని క్వాలిటీ పెంచాలని సిబ్బందికి సూచించారు. కూరలు రుచికరంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అన్నం, కూరలు తిరుపతి నుండి వస్తుందని సిబ్బంది జడ్జికి తెలిపారు. అన్నా క్యాంటీన్‌లో భోజనం సక్రమంగా లేదని ఫిర్యాదు అందడంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట న్యాయవాదులు రాజేష్, కిషోర్, రాజారావు తదితరులు ఉన్నారు.

## జన విజ్ఞాన వేదిక మహాసభలకు ఆహ్వానం

### - మహాసభల గోడపత్రికలు విడుదల
### - జేవివి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్

గూడూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త



జన విజ్ఞాన వేదిక మహాసభలకు విశ్రాంత ఉద్యోగుల భవనం నందు శనివారం గోడ పత్రికలు విడుదల చేసారు. జే.వి.వి. అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక మహాసభలు గూడూరు విశ్రాంత ఉద్యోగుల భవనం నందు 24వ తేదీన (ఆదివారం) 10.00 గంటలకు 32 సంవత్సరాలుగా సైన్స్ ప్రచార సంస్థగా మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన పెంపొందిస్తూ ప్లాస్టిక్ నిర్మూలించాలని, చెట్లను పెంచాలని ప్రజలను మంచి మార్గంలో నడవాలని తెలియజేస్తూ ఇలా సమాజంలోని అన్ని అంశాల మీద పనిచేస్తున్నటువంటి వేదిక జనవిజ్ఞాన వేదిక రాబోయే రోజుల్లో ఇంకా సమాజం కోసం ఏం చేయాలి ప్రజలకు మూఢనమ్మకాల పై అవగాహన కల్పించడం అనే అంశాల మీద చర్చించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం గారు మరియు గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు హాజరవుతారు. భవిష్యత్తు కార్యక్రమాల మీద చర్చించి అందరి సలహాలు తీసుకొని ఇంకా ఎక్కువగా ప్రజల్లోకి పోయేదానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జే.వి.వి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, రామమోహన్, సుబ్బారావు, సుమన్ రెడ్డి, ఇబ్రహీం, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రేస్ స్కూల్‌లో ఘనంగా 2వ నేషనల్ స్పేస్ డే వేడుకలు

చిల్లకూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త




చిల్లకూరు మండలం చింతవరం గ్రామంలో వున్న రేస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 2వ నేషనల్ స్పేస్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చంద్రయాన్ 3 ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రగ్యాన్ యొక్క నమూనాను ప్రదర్శించి పిల్లలకి చంద్రయాన్ 3 చంద్రుని యొక్క దక్షిణ ధృవం పైన ల్యాండ్ అయినా విధానాన్ని, ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రగ్యాన్ గురించి కరస్పాండెంట్ యల్లసిరి బాలచెన్నయ్య విద్యార్థులకు వివరించారు. అంతేకాకుండా నాటి ఆర్యభట్ట ఉపగ్రహం నుండి నేటి చంద్రయాన్ 3 వరకు మన శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుండి ఎన్నో ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించారని కరెస్పాండెంట్ విద్యార్థులకు తెలియపరిచారు. భారత దేశ ఖ్యాతిని అంతరిక్షంలో ఇనుమడింప చేసిన రోజు చంద్రుని దక్షిణ ధృవం పైన చంద్రయాన్ 3 సురక్షితంగా ల్యాండ్ అయినా రోజు ఈ నేషనల్ స్పేస్ డేను రేస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ జరుపుకోవడం ఒక భారతీయుడిగా చాలా గర్వంగా ఉంది అని కరస్పాండెంట్ యల్లసిరి బాలచెన్నయ్య అన్నారు. పాఠశాల ప్రెసిడెంట్ గుమ్మడి వెంకట సుబ్బయ్య, కరస్పాండెంట్ యల్లసిరి బాలచెన్నయ్య, ప్రధానోపాధ్యాయురాలు డి.లక్ష్మి, ఉపాధ్యాయినిలు, విద్యార్థుల పాల్గొన్నారు.

## నేడు వెంకయ్య స్వామి ఆరాధన మహోత్సవాలు

బాలాయపల్లి, ఆగస్టు 23, ప్రభాతవార్త

మండలంలోని జయంపు గ్రామంలో కలిసి ఉన్న భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి 21వ ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు పంచామృత పాలాభిషేకం, ఎనిమిది గంటలకు హోమం పూజలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 10 నుండి 11 గంటల వరకు తులసి దళాలతో అష్టోత్తర నామావళి జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 నుండి అన్నదానం కార్యక్రమం జరుగుతుందని వివరించారు. భక్తులు విరివిగా పాల్గొనాలని తెలిపారు.

## వాకాడులో స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర



వాకాడు, ఆగస్టు 23, ప్రభాతవార్త వాకాడులో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులపై కార్యక్రమం నిర్వహించారు. శనివారం వాకాడులోని దళితవాడలో మురికి కాలువలోని నిల్వ ఉన్న చెత్త చేదారం, తొలగించారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీని పరిశుభ్రత చేశారు. పాత హరిజనవాడలో డ్రైనేజీ కాలువలను మరమ్మతులు చేయాలని స్థానికులు అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్ డి వో వాణి, ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమాం జలి, పి ఆర్ ఏ ఈ కిరణ్, ఎంఈఓ బాబు, ఏపీవో విజయ, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, నువ్వు దశకల సిబ్బంది పంచాయతీ పాలకులు తదితరులు ఉన్నారు.

## బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన

గూడూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త



గూడూరు మండలం పరిధిలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు చవటపాలెం ప్రభుత్వ హైస్కూల్ నందు శనివారం కిశోరి బాలికలకు బాల్య వివాహాలు పై అవగాహన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్, సిడిపిఒ. మహబూబి మాట్లాడుతూ బాలికలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కొంత మంది తల్లి దండ్రులు మైనర్ బాలికలకు వివాహాలు చేస్తున్నారని , బాల్య వివాహాల వలన అనేక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలకి గురి అవుతున్నారని పేర్కొన్నారు. బాల్య వివాహాలను నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ స్వరూపరాణి, హైస్కూల్ హెడ్ మాస్టర్ కుమార్,టీచర్ భారతి, అంగన్వాడీ టీచర్స్ ఎం.యశోద, టి.దేవసేనమ్మ, ఎస్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు




గూడూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని వర్షాకాలంలో విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని గూడూరు పురపాలక సంఘ కమిషనర్ వెంకటేశ్వర్లు సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద పుర పాలక సంఘ ఆధ్వర్యంలో మున్సిపల్, మెప్మా సిబ్బందికీ ప్రజలకు వర్షాకాల పరిశుభ్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతినెల స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాధాన్యత అంశం ఇస్తుందని పేర్కొన్నారు. ఈనెల అంశం వర్షాకాల పరిశుభ్రత అని తెలిపారు. వర్షాకాలంలో ఎక్కువగా మలేరియా డెంగ్యూ విష జ్వరాలు వస్తా యని ప్రధానంగా మురుగునీరు నిల్వ ఉండటం వల్ల జ్వరాలు వస్తాయని వెల్లడించారు. విష జ్వరాలను నిర్మూలించేందుకు ప్రజలందరూ నివాసాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెప్మా సిబ్బంది స్లమ్ ఏరియాలో ఉండే ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

కోట,ఆగస్టు,23 ప్రభాతవార్త



కోట మండలంలోని నెల్లూరుపల్లికొత్తపాళెం, కోట గ్రామాల్లో గ్రామ సభలు శనివారం తహసీల్దార్ కె.జయజయరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఆయా గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ సభలను ఆయా గ్రామల రైతులు స్వదినియోగం చేసుకోవాలని జయజయరావు కోరారు. గ్రామ సభలలో వచ్చిన అర్జీలను సమగ్రంగా విచారణ జరిపి రైతులకు సంబంధించిన భూ రికార్డులను సరి చేయడం జరుగుతుందన్నారు. ఈ గ్రామ సభల్లో సర్వేయర్ గోపినాద్, విఆర్ఓలు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో స్వర్ణాంధ్ర-స్వేచ్ఛంధ్ర ...

నాయుడుపేట ఆగస్టు 23 ప్రభాతవార్త ;

నాయుడుపేట పట్టణంలోని మున్సిపాల్టి కమిషనర్ పజులుల్లా ఆధ్వర్యంలో అధికారులు శనివారం స్వర్ణాంధ్ర–స్వేచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.అనంతరం మున్సిపాల్టి కార్యాలయం నుండి స్వర్ణాంధ్ర–స్వాచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాన్ సూన్ హైజీన్ థీమ్ ర్యాలీని పట్టణ పురవీదుల్లో చేపట్టారు.ఈసందర్భంగా కమిషనర్ పజులుల్లా మాట్లడుతూ సీజనల్ వ్యాదులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి దోమకాటును నివారించడం,పరిశుభ్రతను పాటించడం,ఇంటిపరిసరాల్లో మురికినీరు నిల్వచేరకుండ తగుజాగ్రర్తలు తీసుకోవాలన్నారు.వ్యక్తిగత పరిశుభ్రతను ప్రతిఒక్కరు తప్పనిసరిగా పాటించాలని తెలియజేశారు.ఈకార్యక్రమంలో మున్సిపాల్టి అధికారులు,సచివాలయ,మెప్మా సిబ్బిది తదితరులు పాల్గోన్నారు.

## రాష్ట్ర మహాసభలకు తరలి వెళ్లిన గూడూరు సిపిఐ శ్రేణులు

గూడూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త

పేద ప్రజల హక్కుల సాధనకై ఒంగోలులో జరుగుతున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలకు గూడూరు సీపీఐ శ్రేణులు తరలి వెళ్లారు. గూడూరు సీపీఐ కార్యాలయం నుండి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీగా తరలి వెళ్లారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజవర్గ కార్యదర్శి శశి కుమార్ మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్దే సీపీఐ ధ్యేయం అన్నారు. వంద ఏళ్లుగా బడుగు, బలహీన వర్గాలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పోరాడుతుందన్నారు. దోపిడి ఉన్నంత కాలం ఎర్రజండా పోరాడుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర మహ సభలలో తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామా నాయుడు, శివా రెడ్డి, క్రిష్ణప్ప, సాంబ శివ, మురళి, విజయ భాస్కర్, ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సివిఆర్ కుమార్, నారాయణ, సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, మీరా భాయ్, తదితరులు తరలివెళ్లారు.



## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో అందరూ భాగస్వామ్యులు కావాలి



కోట,ఆగస్టు 23 ప్రభాతవార్త

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అందరు భాగస్వామ్యం కావాలని ఎంపిడిఒ వి.వేణు కోరారు. శనివారం కోట పంచాయతీలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో ఎంపిడివో వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మూడువ శనివారం స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్లాస్టిక్ నిర్మూలన, డ్రైనేజి క్లినింగ్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చెత్తా అన్నది పెద్ద సమస్యగా మారిపోయిందన్నారు. ప్రజలు అవగాహన కలిగి తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఇక్కరు తమ ఇళ్లే కాకుండా తమ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.అంతక ముందు డిఎల్‌డిఒ వాణి పంచాయతీ పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి



దొరవారి సత్రం, ఆగష్టు 23 ప్రభాతవార్త:

దొరవారిసత్రం మండల పరిధిలోని రైల్వే స్టేషన్‌కి సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద ప్రమాదస్తూ రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది స్థానికులు రైల్వే అధికారుల వివరాలు మేరుకు ఏకల గ్రామానికి చెందిన బందిలి గురవయ్య 35 రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో ప్రమాదస్తు రైలు ఢీకొని మృతి చెందాడు ఈ మృతి దేహాన్ని పంచి నామ నిమిత్తం సులూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అనంతరం రైల్వే జి ఆర్ పి ఓ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## పేరూరు చెరువును పరిశీలించిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు



తిరుపతిరూరల్,ఆగస్టు23 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ పేరూరు చెరువు తిరుపతి రూరల్ మండల ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు శనివారం పరిశీలించారు. జడ్పి చైర్మెన్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పేరూరు చెరువులో కలుస్తున్న మురుగునీటి కాల్వలను పరిశీలించారు. మురుగునీరు పేరూరు చెరువులో కలవడంతో స్వచ్ఛమైన వర్షపు నీరు కలుషితమైతుందని తెలిపారు. కలుషిత నీరును పరిశీలించిన అధికారులు, ఏ పంచాయతీ నుండి మురుగునీరు వస్తుందో ఆయా పంచాయతీల కార్యధర్శులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకునే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. మురుగునీరు ప్రత్యామ్నాయ మార్గం నీటిశుద్ధి యంత్రాల ద్వారా శుద్ధి ఒక్కటే మార్గమనే నిర్ధేశానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ ఎంపిపి చంద్రమోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌చార్జి ఎస్ఇ నరేంద్రకుమార్, డిఇ ఉపేంద్రరెడ్డి, ఏఇ హిమంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు

### - అర్డీఓ శ్రీనివాసులు, డిఎస్పీ సాయినాథ్



చిత్తూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త:

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, డిఎస్పీ సాయినాథ్‌లు పేర్కొన్నారు. చిత్తూరు అర్డీఓ కార్యాలయంలో శనివారం అర్డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అర్డీఓ మాట్లాడుతూ చవితి ఉత్సవాలు సందర్భంగా నగర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, ఫైర్ ఆఫీసర్ కరుణాకర్, అర్టీసీ డిఎం రూపశ్రీ, ఎపిఎస్‌పిడిఎల్ ఇఇ ఎవిఎస్ఎస్ ప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, కమిటీ సభ్యులు రామభద్ర, హరిప్రసాద్, షణ్ముగం, వెంకటేష్, జయచంద్ర, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అరగొండలో కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి



తవణంపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త:

కుటుంబకలహాలతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అరగొండలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై చిరంజీవి కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని అరగొండ గ్రామ యాదవవీధికి చెందిన ఉమాపతి కుమారుడు సుధీర్‌కుమార్(31) అనే వ్యక్తి తిరుపతిలో డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడే కాపురముంటున్నాడు. అక్కడ పలువురు నుండి అప్పులు చేసి తిరిగి కట్టలేక గత మూడునెలల క్రితం స్వగ్రామం అరగొండకు చేరుకుని ఖాళీగా వుంటున్నాడు. ఈనేపథ్యంలో గత రెండు రోజుల క్రితం సుధీర్ తన భార్యతో గొడవపడ్డాడు. దీనితో సుధీర్ భార్య తన ఇద్దరు పిల్లలను ఇంటిలో వదిలిపెట్టి పుట్టింటికి వెళ్ళిపోవడంతో చేసిన అప్పులు కట్టలేక,జీవనోపాధి లేక మనస్థాపంతో శుక్రవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీనితో బంధువులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుధీర్ శనివారం ఉదయం మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సుధీర్ రెడ్డి మాట ఇస్తే తప్పడు....



రేణిగుంట ఆగస్టు23 ప్రభాతవార్త.

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట ఇస్తే మాట నెరవేర్చే వరకు నిద్రపోడని రేణిగుంట స్కూటర్ మెకానికులు ముక్తకంఠంతో అన్నారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నందుకు శనివారం రేణిగుంట పట్టణానికి చెందిన స్కూటర్ మెకానికులు సుధీర్ రెడ్డి ని కలిసి ప్రశంసలతో ముంచేత్తారు. ఎన్నికల సమయంలో స్కూటర్ మెకానికులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం ఇప్పిస్తానని వాగ్దానం చేశారని వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారని స్కూటర్ మెకానిక్ లందరూ సుధీర్ రెడ్డిని కలిశారు. వెంటనే ఆయన స్కూటర్ మెకానికులకు కమ్యూనిటీ హాల్ కోసం స్థలం అదేవిధంగా అర్హులైన మెకానికులకు ఇంటి స్థలాలు కేటాయించాలని తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డిని ఆదేశించారు. వారం రోజుల్లో స్థలాలు కేటాయిస్తామని తహసిల్దార్ హామీ ఇచ్చినట్లు రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

## ఉధృతంగా వంతెనపై ప్రవహిస్తున్న నీరు



పాలసముద్రం ఆగస్టు 23 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం కేంద్రం నుంచి మఠవలం గ్రామానికి వెళ్లే దారిలో గల వంతెనపై శుక్రవారం కురిసిన భారీ వర్షానికి నీటి ప్రవాహం ఎక్కువ కావ దంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిత్యం ప్రజలు పాలసముద్రం నుంచి మఠవలం గ్రామా నికి మరియు పక్కనే ఉన్న తమిళ నాడు సరిహద్దు ప్రాంతమైన అమ్మయారు కుప్పంకు అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై వెళు తుంటారు. వంతెన పై నీరు ఉధృతంగా ప్రవహించడంతో ప్రయాణికులు కొంతమంది లోతు తెలియక వెళ్లే సాహసం కూడా చేశారు.ఈ వంతెన మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న ఒక అధికారి కూడా కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. వంతెన పై ఉధృతంగా నీరు ప్రవహిస్తున్న సంబంధిత అధికారులు వచ్చి వాహన చోదకులకు, పాదాచారులకు ఎలాంటి సూచనలు సలహాలు ఇవ్వకపోవడం తో సంబంధిత అధికారులపై స్థానిక ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఇలాంటి వి పునరావృతం కాకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## గణనాధుని సన్నిధిలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి



కాణిపాకం, ఆగస్టు 23 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట చిత్తూరు జిల్లా జడ్జి అరుణసారిక, సూపరెడెంట్ వాసు, చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, స్థానిక ఎస్సై నరసింహులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంతరిక్ష రంగంలో భారతదేశం ప్రపంచ నాయకుడు

### - ఐఐఎ డా॥ గౌరవ్ బెనర్జీ




కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త

అంతరిక్ష రంగంలో భారతదేశం సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రపంచ నాయకుడిగా నిలుస్తోందని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్‌కు చెందిన డా॥ గౌరవ్ బెనర్జీ పేర్కొన్నారు. శనివారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో జాతీయ అంతరిక్ష దినోత్సవం 2025 కార్యక్రమాన్ని కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గౌరవ్ బెనర్జీమాట్లాడుతూ ఒక చిన్న మత్స్యకార గ్రామంనుంచి మొదలు చంద్రుడు, మంగళగ్రహాల వరకు సాగిన అంతరిక్ష ప్రయాణాలను వివరించారు. కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ , ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు మాట్లాడుతూ కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు, అధ్యాపకులు, ఎపి ప్రభుత్వం, ఇస్రోతో కలసి దేశంలోనే తొలిసారిగా మెరుపు హెచ్చరిక సా ంకేతికతను అందించారన్నారు. మంత్రి నారా లోకేష్ వజ్రపాత్ యాప్ గురించి సైతం ట్వీట్ చేయడం జరిగిందని ఇసిఇ హెచ్ఒడి డా॥ కోదండరామయ్య తెలిపారు. కన్వీనర్ డా॥ రాసదురై, డా॥ అజయ్‌కుమార్‌రెఒడ్డి, డా॥సంతోష్ బి.పంజగల్, డా॥ లక్ష్మీపతి పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికభావంతో నగరసంకీర్తన

### గోవిందనామాలతో ప్రతిధ్వనింపు



తిరుపతి రవాణ,ఆగస్టు 23ప్రభాతవార్త:

పుణ్యక్షేత్రం తిరుపతినగరంలో నగర సంకీర్తన యాత్రికుల్లో నగరప్రజల్లో ఆధ్యాత్మికవైపు నడిపిస్తోంది. ప్రతి శనివారం వేకువజామున తిరుపతి నగరం గోవిందనామస్మరణతో మార్మోగుతోంది. తిరుపతి ప్రజల్లో భక్తిభావం పెంపొందింపజేసేందుకు ప్రతి శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో ,నగరవాసుల్లో మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చేస్తోంది. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు తొండడమనాటి సుబ్రమణ్యంరెడ్డి, అన్నూరు మునిరత్నంఆచారి, పార్వతి, జయమ్మ, మునేంద్రరెడ్డి, మోహన్‌రెడ్డి, బాబు,కల్పన,విద్వాన్ పద్మనాభం, మునినాథరెడ్డి, విక్రమ్‌స్వామి, నరసింహారెడ్డి, కొండే చెంగారెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, మేకల గంగయ్య, సురేంద్రరాజు, పద్మావతి, జయమ్మ, కళ . విగ్రహాల కల్యాణి, మురళీరెడ్డి, వందమంది కళాకారులు ఆధ్యాత్మిక చింతనతో కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## ప్రతి ఒక్కరు పరిశుభ్రతలో భాగస్వామ్యం

### - జిల్లా పోలీసు కార్యాలయంలో మొక్కలు నాటిన ఆపరేషన్స్ ఎఎస్పీ

చిత్తూరుహెల్త్, ఆగస్టు 23 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు పరిశుభ్రతలో భాగస్వామ్యమై సమాజానికి గొప్ప బహుమతి అందించాలని ఆపరేషన్స్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు పిలుపునిచ్చారు. 4వ శనివారం పురస్కరించుకుని పోలీసులు జిల్లా పోలీసు కార్యాలయం, పోలీసు శిక్షణ కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛతా దివస్ కార్యక్రమంను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎఎస్పీ. ఇన్‌ఛార్జి అడ్మిన్ ఎఎస్పీ ఎస్.ఆర్ రాజశేఖర్‌రాజు పాల్గొని మొక్కలు నాటి పోలీసు అధికారులు, సిబ్బందితో స్వచ్ఛ దివస్‌పై ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో ఈ కార్యక్రమంకు హాజరైన ఏఆర్ ఎఎస్పీ శివానందకిషోర్, ఏఆర్ డిఎస్పీ చిన్నికృష్ణ, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, ఆర్ఐలు సుధాకర్, చంద్రశేఖర్‌లు పరిసరాలను పరిశుభ్రం చేసి ప్రతిజ్ఞ చేశారు.